వార్త
ఆదివారం
30 ఏప్రిల్ 2017

'దాదా' విశ్వనాథ్

'కళాతపస్వి'కి ఘనపురస్కారం

mohan PUBLICATIONS
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.
Mohanpublications.com
SUNDAY SPECIAL MAGAZINES
గ్రంథనిధి

తారాతీరం

పుస్తకాలతోనే సహవాసం

బాలీవుడ్ భామ సోనాలి బింద్రే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరే.. మురారి, ఇంద్ర, మన్మథుడు వంటి చిత్రాలతో టాలీవుడ్ ప్రేక్షకులతో బోలెడంత అనుబంధం పెంచేసుకుందీ భామ.. ఇక్కడి ప్రజలు ఆదరించిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని చెప్పింది. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఒక మీట్‌లో పాల్గొన్న ఈ భామ.. హీరోయిన్స్ పాత్రలతో తనకు వ్యక్తిగతంగా చాలా సమస్యలున్నాయని అంది.. మూవీ మేకర్స్ మమ్మల్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించరు.. చిన్నప్పటి నుంచి పుస్తకాలతో ఎక్కువ సహవాసం చేశాను.. అని చెప్పింది. అతిపెద్ద లైబ్రరీ ఏర్పాటు తనను వెంటాడుతున్న కలగా చెప్పిందీ కుందనాల బొమ్మ..

స్టార్‌తో షూటింగ్‌లో జాయిన్

తమిళ స్టార్ విజయ్ 61వ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. ఇన్నాళ్లు హీరో విజయ్‌పైనే జరిగిన షూటింగ్ నిన్నటి నుండి కథానాయికల మీద కూడ మొదలైంది. అందుకే హీరోయిన్ కాజల్ అగర్వాల్ షూటింగ్‌లో జాయిన్ అయ్యింది.. గతంలో విజయ్-కాజల్ జంటగా రూపొందిన తుపాకి చిత్రం భారీ విజయం సాధించటంతో వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ సినిమాపై కూడ భారీ అంచనాలున్నాయి. 2016లో వరుస పరాజయాలు చవిచూపిన కాజల్‌కు ఈ చిత్రం మంచి బ్రేక్ ఇచ్చి మరోసారి స్టార్ హీరోయిన్ రేస్‌లో నిలబడేలా చేస్తుందని సినీవర్గాలు భావిస్తున్నాయి. శ్రీ తెండల్ ఫిలిమ్స్ తన 100వ చిత్రంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం ఫస్ట్ లుక్ జూన్ 22న రిలీజ్ కానుండగా చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల చేయాలని భావిస్తున్నారు.

ఆ పాత్ర అసభ్యంగా ఉండదు

బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో క్యూట్ రోల్స్ చేసి, మెప్పించిన మిస్తీ చక్రవర్తి, తొలిసారిగా అడల్ట్ కంటెంట్ మూవీలో నటిస్తోంది.. బాబు బాగా బిజీ ..అంటూ బాలీవుడ్ మూవీ హంటర్‌కు రీమేక్‌గా తెరకెక్కుతున్న చిత్రంలో శ్రీనివాస్ అవసరాలకు జోడీగా నటిస్తోందీ భామ.. అయితే ఆ చిత్రం ట్రైలర్ రిలీజ్ అయినప్పటి నుంచి హీరోయిన్లు మరీ అశ్లీలంగా కన్పిస్తున్నారనే మాటలు ఎక్కువగానే విన్పిస్తున్నాయి. ఈ పాత్ర అసభ్యంగా ఉండదని, ఆడియన్స్‌ను మెప్పించేలా ఉంటుందంటోంది మిస్తీ చక్రవర్తి.

అక్షరాలా రూ.6కోట్లు

కరీనా కపూర్ వయసు ఇపుడు దాదాపు 36 ఏళ్లు. ఇప్పటికీ వన్నె తరగని అందంతో మతి పోగొడుతోంది.. మళ్లీ వెండితెరపై కన్పించనుంది. ఇక ఓ సినిమాకోసం అక్షరాలా రూ.6 కోట్లు ఆఫర్ ఇచ్చారని అంటున్నారు. ఈ చిత్రంలోనూ ఆమె వయస్సుకు తగ్గ పాత్రలో కన్పించనుందని సమాచారం.

కె. లీలా సువర్ణ

పాజిటివ్ లైఫ్

డా॥ A.M. రెడ్డి
సీనియర్ వైద్యులు,
పాజిటివ్ హోమియోపతి
హైదరాబాద్, నిజామాబాద్
హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
Ph: 903-056-1144
767-200-2000

కిడ్నీ స్టోన్స్ కు హోమియో చికిత్స



మూత్రపిండాల్లో రాళ్ళు ఏర్పడటం అనేది ఈ మధ్యకాలంలో చాలా ఎక్కువగా జరుగుతుంది. నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎక్సామినేషన్ సర్వే ప్రకారం ఇండియాలో పురుషుల్లో 10.6% మంది, స్త్రీలల్లో 7.1% మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. దీనికి మారిన జీవన శైలి, ప్రపంచ ఆధునీకరణ, మారిన ఆహార అలవాట్లు, స్థూలకాయం వంటివి ప్రధాన కారణాలుగా భావించవచ్చు. మూత్రపిండాలు మానవ శరీరంలో అతి ముఖ్యమైన భాగాలు. ప్రతి మనిషిలో రెండు కిడ్నీలు నడుముకు ఇరువైపులా ఉంటాయి. ఈ ప్రధానమైన అవయవం రక్తాన్ని శుద్ధిచేసి అందులోని హానికరమైన మరియు విషపదార్థాలను మూత్రం రూపంలో బయటకు పంపించి వేస్తాయి. **వ్యాధి లక్షణాలు:** కొన్ని సందర్భాలలో వ్యక్తికి కిడ్నీలో రాళ్ళ వల్ల ఎలాంటి లక్షణాలు కనబడవు. రాళ్ళ పరిమాణం బట్టి వ్యాధి లక్షణాలు మొదలవుతాయి. నడుమునుండి గజ్జలలోకి తీవ్రమైన నొప్పి రావటం, పొత్తికడుపులో తీవ్రమైన నొప్పి, నీరసం, వికారంతో కూడిన వాంతులు, తీవ్రమైన జ్వరం, విపరీతమైన చెమటలు, మూత్రంలో రక్తం పడటం, మంటరావటం. **చికిత్స:** కిడ్నీలో రాళ్ళ సమస్యకు శాశ్వతమైన పరిష్కారం అందుబాటులో ఉంది. రాళ్ళ పరిమాణం బట్టి చికిత్స ఎంతకాలం పడుతుందో తెలుస్తుంది. 8 యం.యం. కంటే తక్కువగా ఉండే రాళ్ళకు ఎలాంటి సర్జరీ అవసరం లేకుండా శాశ్వతంగా రాళ్ళు మూత్రంలో పడిపోవటానికి పాజిటివ్ హోమియోపతిలో అద్భుతమైన మందులు అందుబాటులో ఉన్నాయి. మనిషి తత్వాన్ని బట్టి వ్యాధి మరియు మానసిక లక్షణాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని కాన్స్టిట్యూషనల్ పద్ధతి ద్వారా వాడటం వల్ల శాశ్వతమైన పరిష్కారం లభిస్తుంది.

An ISO 9001 - 2000 Certified ®

The art of healing

పాజిటివ్ హోమియోపతి

www.drpositive.in

సోరియాసిస్ కు అద్భుతమైన హోమియో చికిత్స

సోరియాసిస్ అనేది దీర్ఘకాలపు చర్మ వ్యాధి. అంటువ్యాధి కాదు. ఎక్కువగా వంశపారంపర్య కుటుంబాలలో కలిగి ఉన్న వారికి వస్తుంది. ఇది స్వల్పమైన వ్యాధి. దీని వల్ల చర్మం ఎర్ర బారడం, పొలుసులుగా రావడం, మచ్చలు పడటం జరుగుతుంది. ఈ వ్యాధి లక్షణాలు జీవితాంతము వస్తుంటాయి, పోతుంటాయి. ఈ వ్యాధి స్త్రీ, పురులకు సమానంగా వర్తిస్తుంది. అన్ని జాతుల వారికి సంక్రమిస్తుంది. వ్యక్తులలో కొన్ని జన్యుపరమైన ప్రేరేపణ వల్ల తప్పుడు సూచనలు శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థకు పంపబడతాయి. దీని వల్ల చర్మకణాల పెరుగుదల చక్రం ఎక్కువవుతుంది. ఈ చర్మకణాలు ఒకదానిపై ఒకటి పేరుకుపోతాయి. ఇవి త్వరగా రాలిపోవు. **సోరియాసిస్ లక్షణాలు:** చర్మం ఎర్రబారడం, పొలుసులుగా రాలడం, దురద, గట్టిపడటం, పగుళ్ళు, అరిచేయి, అరికాలు మీద బొబ్బలు ఏర్పడటం. స్వల్పంగా ఉండచ్చు లేకపోతే ఆకృతి కోల్పోవడం, చేతకాని స్థితికి రావడం లాంటి తీవ్రమైన స్థాయికి చేరుకోవచ్చు. చర్మాన్ని పొలుసులు పొలుసులుగా మర్చి, పొట్టుపొట్టుగా రాల్చే సోరియాసిస్ ఒక పట్టాన మానే జబ్బుకాదు. చికిత్స తీసుకుంటున్నప్పటికీ తగ్గుతూ, తిరిగి వస్తూ తెగ ఇబ్బంది పెడుతుంటుంది. అయితే వ్యాధిని ప్రేరేపించే కారకాలకు దూరంగా ఉంటే తీవ్రతను తగ్గించుకోవచ్చు. **చికిత్స:** సోరియాసిస్ వ్యాధి ఉధ్రుతమైనది, దీర్ఘకాలికమైనది కావున ఒక రోగికి, మరో రోగికి వ్యాధి తీవ్రతలో తేడా ఉంటుంది. జబ్బుతీవ్రతను బట్టి చికిత్స చేయవలసిన అవసరముంటుంది. తగినంత శారీరక శ్రమ, విశ్రాంతి, సమతుల్య ఆహారమే, మంచి అలవాట్లు, మెడిటేషన్, చర్మరక్షణకు సంబంధించిన జాగ్రత్తలు, ఇతర ఇన్ఫెక్షన్స్ రాకుండా సుచి-శుభ్రత పాటించడం, పొడి చర్మానికి తేమకోసం ఆయిల్ పూయడం మంచిది. పాజిటివ్ హోమియోపతిలో అద్భుతమైన మందులు అందుబాటులో ఉన్నాయి. మనిషి తత్వాన్ని బట్టి వ్యాధి మరియు మానసిక లక్షణాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని కాన్స్టిట్యూషనల్ పద్ధతి ద్వారా వాడటం వల్ల శాశ్వతమైన పరిష్కారం లభిస్తుంది.

బేగంపేట | అమీర్‌పేట | జూబ్లిహిల్స్ | కొండాపూర్ | కూకట్‌పల్లి | విక్రమ్‌పురి | A.S.రావు నగర్
కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | మెహిదీపట్నం | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం | తమిళనాడు
Toll Free: 1800-108-1900

ఆదివారం వార్త

30 ఏప్రిల్ 2017

విషయ విశేషం

'సంఘీ'భావం
తాగుబోతుల డ్రైవింగ్‌ను ఆపలేమా?.. 5
మూడో కన్ను
పగిలిన 'బుగ్గ'లు....6
కవర్‌స్టోరీ
'దాదా' విశ్వనాథ్
'కళాతపస్వి'కు ఘన పురస్కారం..8
భజ గోవిందం......12
ప్రేమ కథామాలిక
క్రౌర్యాన్ని గెలిచిన ప్రేమ!
కథ
అద్దంలో 'కలిమనె'....20
ఈవారం కవిత్వం
మనిషిని ప్రేమిస్తాను....23
చిత్రభారతి
భువినుండి దివికి తారలు దిగివచ్చిన వేళ....30
ఇంకా..కృతి, మొగ్గ, నవ్వుల్..రువ్వుల్, వాస్తు వార్త, పదమథనం ..వారఫలం.. వగైరా... వగైరా.

మంచి ముత్యాలు

సంస్కారం, సభ్యత అనేవి ఎక్కడికి వెళ్లినా గౌరవం లభింపజేసే పాస్‌పోర్టులు.
-జాన్సన్



లేఖలు

కవర్ స్టోరీ మార్వెలస్!

ఏప్రిల్ 16 వార్త ఆదివారం అనుబంధంలో అందించిన కవర్ స్టోరీ 'పుట్టకుండానే మరణశిక్ష!' ఈవారానికే మార్వెలస్. కను విప్పు కలిగించేలా ఉంది కథనం. మనదేశంలో భ్రూణహత్యలు పెరిగిపోతూ, మాతృమూర్తుల ప్రాణాలు కూడా బలికావటం శోచనీయం. ఆడ, మగ వివక్ష అంతరిస్తేనే ఇటువంటి దారుణాలు అంతం అయ్యేది.

-పక్కి రాధా గోపాలకృష్ణ, విశాఖ;
టి. సాయికుమార్, హైదరాబాద్.

ఆలోచింపజేశాయి..

ఏప్రిల్ 16 వార్త ఆదివారం అనుబంధం 'సంఘీ'భావం'లో సంతోష భారత్ ఎప్పుడోనంటూ వ్యక్తపరిచిన ఆవేదన సహేతుకమైందే. గతమెంతో ఘనకీర్తి కలిగిన భారత్ సంతోష్ స్కోర్ 122 కావడం మిక్కిలి బాధాకరం. కవర్‌స్టోరీలో కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న భ్రూణహత్యలను ప్రభుత్వాలు తక్షణం చర్యతీసుకుని నిరోధించాలి. 'మూడోకన్ను'లో మారని చైనా ధోరణిని చక్కగా విశ్లేషించారు. 'భావవీచిక'లో చెప్పినట్లు మన ధరిత్రిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి విధి.

-అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, కూకట్‌పల్లి.

అలరించిన మేగజైన్..

ఏప్రిల్ 16 వార్త ఆదివారం అనుబంధంలో భావవీచికలో నేల సారాన్ని కాపాడుకోవాలన్న సందేశాన్ని చక్కగా వివరించారు. 'కవర్‌స్టోరీ'లో ఎన్నో ప్రయోజనాత్మక అంశాలను ప్రస్తావించారు. రంగుల హరివిల్లు మొగ్గ' వారంవారం ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటోంది. 'చేజారిన బహుమతి' రచయిత్రి సి.ప్రణయజకు అభినందనలు. 'బొమ్మ-బొరుసు' కవిత బాలల దుస్థితికి దర్పణం పట్టింది. బ్యాక్ కవర్ కడు రమణీయంగా ఉంది.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం.

విలువైన ఆర్టికల్స్

ఏప్రిల్ 16 వార్త ఆదివారం అనుబంధంలో 'పుట్టకుండానే మరణశిక్ష' కవర్‌స్టోరీలో మనదేశంలో ఆడపిల్లపట్ల వివక్షతో జరుగుతున్న భ్రూణహత్యల గురించి, వైద్యరంగంలోని లొసుగుల గురించి చక్కగా విశ్లేషించారు. సంతోష భారత్‌పై 'సంఘీ'భావం' ఎంతో బాగుంది. ఈవారం కవిత్వంలో కవితలు ముఖ్యంగా అంతర్ భావలోకాలు హృదయానికి అత్యంత ఆహ్లాదకరంగా రూపొందాయి. 'చేజారిన బహుమతి' కథ చక్కగా ఉంది. ఉప్పల నరసింహంగారి ఆర్టికల్‌లో ధనం కన్నా జ్ఞానం కీలకమైందని ఎంతో బాగా వివరించారు. విలువైన ఆర్టికల్స్ అందిస్తోన్న మీకు అభినందనలు.

-డా. శివభూషణం, కర్నూలు.

భావ వీచిక

అక్షరాలను రగిలించిన కవి

కష్టజీవి పట్ల ప్రేమతో అవిశ్రాంతంగా కలాన్ని ఝుళిపించి మహాప్రస్థానాన్ని సాగించిన మహాకవి శ్రీశ్రీ. అక్షరమనే ఆయుధంతో దోపిడీని ప్రశ్నిస్తూ, పీడితుల పక్షాన నిలిచి జన చైతన్యాన్ని రగిల్చిన గొప్ప కలం శక్తి ఆయన. 'వ్యక్తికి బహువచనం శక్తి' అన్నాడు శ్రీశ్రీ. 'కష్టజీవికి ముందు, వెనుక ఉండేవాడే కవి' అని చక్కగా నిర్వచించాడు. ఛందోబద్ధ కవిత్వాన్ని పక్కకు పెట్టి శక్తి మంతమైన వచనంలో కలాన్ని కదిలించి, కవిత్వాన్ని రగిలించాడు. చలం దేవులపల్లిని, శ్రీశ్రీని పోలుస్తూ ఇలా అంటాడు..కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికంతటికీ బాధ, ప్రపంచం బాధ శ్రీశ్రీ బాధ..అని. నిజమే. శ్రీశ్రీ ప్రపంచం బాధనంతటినీ తన ప్రచండ కవిత్వంలో ప్రస్ఫుటింపజేశాడు. ఆయన కవిత్వం పాఠకుడిలో, శ్రోతలో విప్లవ జ్వాల రగులుస్తుంది. మనసంతా ఉద్వేగ భరిత మవుతుంది. శ్రీశ్రీ పేరు తలచుకోగానే గుర్తుకొచ్చేది జయభేరి గేయం..

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను!

నేను సైతం
విశ్వ వృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!

నేను సైతం
భువనఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!

ఆయన మహాప్రస్థానమయితే కవిత్వాభిమాను లందరికీ పరిచితమే.

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది

పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం, పోదాం పైపైకి!

అంటూ సాగించే ప్రస్థానం ఆసాంతం స్ఫూర్తి మంతం. 'శ్రామిక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదోయ్' అంటాడు శ్రీశ్రీ. శ్రీశ్రీ తెలుగువాడు కావడం మన అదృష్టం, మనకు గర్వకారణం. ఆయన కలం ఓ ఖడ్గం. ఏప్రిల్ 30 శ్రీశ్రీ జయంతి. ఆయన స్మృతికి ఈ అక్షరాంజలి!

'సంఘీ'భావం

తాగుబోతుల డ్రైవింగ్‌ను ఆపలేమా?

మత్తుగా తాగి హైవేలపై లారీలను నడిపితే ఎలాంటి రక్తపాతం జరుగుతుందో చిత్తూరు జిల్లా ఏర్పేడు ఘోర రోడ్డు ప్రమాదం మరోసారి రుజువు చేసింది.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అదీ అనుభవం లేని క్లీనర్ తాగి నడపడంతోనే ఏర్పేడులో పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న 15 మంది నిండు ప్రాణాలను బలిగొన్న హృదయ విదారక సంఘటనతోనైనా పాలకులు మేల్కొంటే మంచిది. ఇలాంటి రోడ్డు రక్తపాతాలు జరగడం ..ఇది మొదటిదీ కాదు, చివరిదీ కాదు. ఈ రక్తపాతానికి భారతదేశంలో అంతే లేకుండా పోతున్నది. రోడ్డుపైకి వెళితే మళ్లీ ఇంటికి వస్తామో, రామో తెలియని అభద్రత పరిస్థితులు ఇక్కడ రాజ్యమేలుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేయడం ఒక నేరమైతే, తాగి డ్రైవింగ్ చేయడం మరీ తీవ్రమైన నేరం. అన్నిటికన్నా ఆ క్లీనర్ మహబూబ్‌నగర్ నుంచి చిత్తూరుదాకా వందల కిలోమీటర్లు హైవేపై వెళ్లినా ఎవరూ చెక్ చేయకపోవడం ఎంతటి బాధ్యతారాహిత్యమో ఆలోచించాలి. అడుగడుగునా చెక్‌పోస్టులు వున్నా, రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో రవాణా శాఖ తనిఖీ కేంద్రాలు ఉన్నా డ్రంక్ అండ్ డ్రైవింగ్‌ను అడ్డుకోలేకపోయారంటే మనం ఎలాంటి బాధ్యతా రాహిత్య సమాజంలో నివసిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు.

15 మంది ప్రాణాలను బలి తీసుకున్న క్లీనర్‌కు ఎలాంటి శిక్ష విధించినా పోయిన ప్రాణాలు రావు. కనీసం ఈ దారుణ సంఘటనతోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రంక్ అండ్ డ్రైవింగ్‌ను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకునే దిశగా ముందడుగు వేస్తే మంచిది. లేదంటే ఇదే భవిష్యత్తులో మహా ఉపద్రవంగా మారుతుంది. ఇప్పటికే సుప్రీంకోర్టు డ్రంక్ అండ్ డ్రైవింగ్‌ను నిరోధించడానికి హైవేల వెంట మద్యం దుకాణాలను ఎత్తివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు అడ్డుకునే మార్గాలను లిక్కర్ మాఫియా వెతుకుతున్నది.

తాగి లారీనే కాకుండా కార్లను, ఆటోలను చివరకు ద్విచక్ర వాహనాలను నడుపుతూ ఎంతో మంది ప్రాణాలను బలిగొంటున్నారు. ఇలాంటి తాగుబోతు డ్రైవర్లకు ఒక చట్టమన్నా, పోలీసు అన్నా, ప్రభుత్వం అన్నా భయం లేకపోవడమే! ఇలాంటి రక్తపాతాలు పదే పదే జరగడానికి కారణమవుతున్నాయి. దేశంలో ప్రతీ యేటా అయిదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగితే, లక్షా యాభై వేల మందిదాకా ప్రాణాలు విడుస్తున్నారు. మరో అయిదు లక్షల మంది క్షతగాత్రులై మంచానికి అతుక్కుపోయి నడవలేక పని చేయలేక జీవచ్ఛవాల్లా జీవనాన్ని సాగిస్తున్నారు. భారతదేశంలో రోడ్డు ప్రమాదాలలో చనిపోయినవారి సంఖ్య, ఇప్పటిదాకా జరిగిన అన్ని యుద్ధాల మృతులకంటే ఎక్కువంటే రోడ్ల రక్తపాతం ఎంత అసాధారణంగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. టెర్రరిజంకన్నా ప్రకృతి వైపరీత్యాలకన్నా రోడ్డు ప్రమాదాలు, మానవాళి పాలిట పెనుముప్పుగా పరిణమించాయని మేధావులు చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జాతీయత స్థూల ఉత్పత్తిలో మూడు శాతందాకా నష్టం జరుగుతున్నది. ఎన్నో కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతున్నాయి. వారి భవిష్యత్తు అంధకారమవుతున్నది. ఇంట్లో అందరికి అండగా నిలిచే ఇంటిపెద్ద రోడ్డు ప్రమాదంలో మరణించడమో/ శాశ్వతంగా వికలాంగత్వానికి గురైతే ఆ కుటుంబం మానసిక పరిస్థితి ఏమిటో ఆలోచిస్తే బండరాయి హృదయాలు కూడా కరగక తప్పదు. జాతి పాలిట పెనువిషాదంగా మారిన రోడ్ల రక్తపాతానికి చరమ గీతం పాడడానికి ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు కఠిన కార్యాచరణ చేపట్టాలి. ప్రతి ఏడాది 5 శాతం చొప్పున రోడ్ల ప్రమాదాలు, మృతులు, క్షతగాత్రులు పెరగడమే తప్ప తగ్గడం లేదంటే మన రోడ్డుభద్రత చర్యలు ఎంత ఘోరంగా వున్నాయో ఆలోచించుకోవాలి.

ప్రతిరోజు పన్నెండు వందలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగి, గంటకు 16 మంది చనిపోతున్నారు. ఇప్పుడు ఇందులో పిల్లలు, వృద్ధులున్నారు. రోడ్ల రక్తపాతంపై పరిశోధనలు చేసిన అనేక సంస్థలు దీనికి ప్రధాన కారణం డ్రంక్ అండ్ డ్రైవింగ్ అని తేల్చి చెప్పాయి. అయినా తాగి వాహనాన్ని నడుపకుండా నిలువరించలేకపోతున్నారు.

దేశంలో టెక్నాలజీ రోజు రోజుకు అనూహ్యంగా విస్తరిస్తూ పోతున్నది. జీపిఆర్ఎస్ ద్వారా వాహన కదలికలను తెలుసుకోగలుగు తున్నాం. నావిగేషన్ ద్వారా గమ్యస్థానానికి ఆ ప్రాంతం గురించి ముందుగా తెలియకున్నా సులభంగా చేరగలుగుతున్నాం. తాగి ఎవరైనా డ్రైవింగ్ చేస్తే సెన్సర్లతో ఇంజన్ స్టార్ట్ కాని టెక్నాలజీ కూడా అందుబాట్లోకి వచ్చింది. అయినా మనం ఇంకా వాహనాల్లో అధునాతన టెక్నాలజీని, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వాడలేకపోతున్నాం. చివరికి అత్యధిక మంది ప్రయాణికులను చేరవేసే రైళ్లల్లో, బస్సుల్లో కూడా తాగి డ్రైవర్లు ఇంజన్ స్టార్ట్ చేస్తే ఇంజన్ ప్రారంభం కాని టెక్నాలజీని వాడలేకపోతున్నాం. ఒకవేళ తాగి ముందుకు వెళితే బ్రెత్ ఎనలైజర్ ద్వారా ఎక్కడికక్కడ తనిఖీ చేసే వ్యవస్థను కూడా అందుబాట్లోకి తేలేకపోతున్నాం.

ఈ నిర్లక్ష్యం ఫలితమే తాగి వాహన డ్రైవింగ్‌వల్ల రోడ్డు రక్తపాతాలు ఆందోళనకరంగా పెరిగిపోతున్నాయి. భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు పెరగడానికి తాగి నడపడమే కాకుండా రోడ్ల డిజైన్‌లో లోపాలు, డ్రైవింగ్ లోపాలు, రవాణా శాఖలో అవినీతి లాంటివి ప్రధాన కారణాలని పలు అధ్యయనాలు సూచించిన తరువాత కూడా ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదు. కేంద్ర రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇటీవల పెరిగిన రోడ్ల ప్రమాదాల మహా విషాదంపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ దీనిని నిరోధించడానికి కొత్త రోడ్డు భద్రత బిల్లును తీసుకురానున్నట్లు ప్రకటించారు. అయితే ఈ బిల్లు గతంలో మాదిరిగానే కాగితాలకే పరిమితమవుతుందా? లేక క్షేత్ర స్థాయిలో కఠినంగా అమలై వాహనం నడిపే డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తాడా? ఒకవేళ పాటించకపోతే అలాంటి క్రిమినల్ డ్రైవర్‌ను నిరోధించే నిఘా వ్యవస్థ , అధికార యంత్రాంగం ఈ కొత్త బిల్లులో ఉంటుందా? అనేది వేచి చూడాలి. కానీ ఈలోపు రోడ్ల రక్తపాతం మరింతగా చెలరేగిపోకుండా సత్వరం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. అయినా ఉదాసీనతనే ప్రదర్శిస్తే మాటలు తప్ప చేతలు చేయకపోతే ప్రజలు క్షమించరు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

పగిలిన 'బుగ్గ'లు..

– ఎ.వి.వి. ప్రసాద్

రాజకీయ నాయకులు, మరికొందరు విఐపిలకు కొన్ని రకాల ప్రత్యేక సౌకర్యాలు అవసరమా? అని సుప్రీంకోర్టు గతంలోనే ప్రశ్నించింది. వారికి అలాంటి సౌకర్యాలు పెరిగిపోవడంవల్ల సాధారణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అంటూ విఐపిలకు, ఇతర నేతలకు కల్పించే భద్రతా సౌకర్యాలను సమీక్షించవలసిందిగా కూడా సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఆదేశించింది. బుగ్గకార్ల సౌకర్యం ఎవరెవరికి కల్పించాలనే అంశంపై కూడా కొన్ని సూచనలుచేసింది. వాటిలో ఒకటి ఇంత కాలానికైనా అమలులోకి రావడం ఎంతైనా హర్షణీయం. సర్పంచ్‌ల నుంచి సచివుల దాకా నేతలు, రాజకీయ ముఖ్యులు ప్రజలలోకి వచ్చినపుడు ఎలా వ్యవహరించాలనే విషయంపై సుప్రీంకోర్టు గాని, కేంద్రంగాని కొత్త నిబంధనలు రూపొందించి అమలు చేస్తే సమాజానికి మరింత ప్రయోజనం చేకూరుతుంది.

పగిలె ఎర్రబుగ్గ ప్రముఖుల మతిబోవ
కార్ల మోము వడలె, కాళ్ల కమిలె;
ప్రజల నేతలైన పైపూతలేలయా!
విశ్వవినుత నామ! వినురవేమ!!

మార్పు ఎక్కడనుంచి మొదలవ్వాలని ప్రశ్నించుకుంటే– అది సాధారణ ప్రజలనుంచి కాదు, రాజకీయ నేతలు, ప్రముఖుల నుంచే అనే సమాధానమే సబబనిపిస్తుంది. ఎందుకంటే వారు ఎలాంటి పరిస్థితినైనా తమకు అనుకూలంగా మార్చుకోగలరు గనుక. ఒక్కసారి ఎమ్మెల్యేనో, ఎమ్మెల్సీనో అయితే ఇక తాము సమాజంలో అందరి కంటె అధికులమనుకుంటారు. ఆ ఆధిక్యతను ప్రదర్శించడం కోసం ఎన్నో ప్రత్యేక సౌకర్యాలను సమూర్చుకుంటూ ఉంటారు. తమకు ఆ ప్రత్యేకతను కట్టబెట్టిన ఓటరు నిలువ నీడ లేక అల్లాడుతుంటే, తాము మాత్రం విలాసవంతమైన ఆకాశహర్మ్యాలలో చిందులేస్తుంటారు. ఇది స్పష్టంగా కనిపించే వైరుధ్యం. అర్హత ఉన్నా, లేకపోయినా అందలం ఎక్కేవారు ఉన్నంత కాలం ఈ వైరుధ్యం ఇలాగే సాగుతూంటుంది. అయితే ఏలినవారు తలచుకొంటే ఏదైనా చేయవచ్చుగనుక, వారే కొన్ని మంచిమార్పులకు శ్రీకారం చుడితే, మిగిలిన నాయకమ్మన్యులంతా అనుసరిస్తారు, సమాజంలో కొన్ని చక్కని పరిణామాలకు బాటలు వేసినవారవుతారు. ప్రముఖులు, విఐపిల కార్లకు ఉండే 'ఎర్రబుగ్గ'లను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొన్న నిర్ణయం అటువంటిదే. ఇది ఒక మంచి మార్పు. వెర్రితలలు వేస్తున్న 'విఐపి సంస్కృతి'ని అదుపు చేయాలంటే ఎక్కడో ఒకచోట ఒక ఆరంభమంటూ కావాలి. ఎర్రబుగ్గలను రద్దు చేయడం అటువంటి ఒక ఆరంభం అనుకోవాలి.

ఎర్రబుగ్గ తొలగిస్తున్న తమిళ సిఎం పళని సామి

ఇంత కాలం చిలువలు పలువలుగా విస్తరించిన 'విఐపి మర్యాద'లపై ఎక్కడో ఒకచోట కోత మొదలయితేనే సంస్కరణలు అమలు సాధ్యమవుతుందనుకున్న ప్రధాని మోడీ రాష్ట్రపతి నుంచి మంత్రుల వరకు, ఇతర వివిఐపిల వరకు అందరి వాహనాలపై ఉండే ఎర్రబుగ్గలను తొలగించడానికి చట్టంలో మార్పులు చేస్తున్నట్లుగా ప్రటించడం అభిలషణీయ పరిణామమే. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాల వంటి అత్యవసర సర్వీసులకు మాత్రమే ఆ ఎర్రబుగ్గల వాడకం పరిమితం చేయాలనుకోవడం కూడా అభినందనీయమే. ఎందుకంటే అత్యవసర సర్వీసులకు ఆ సౌకర్యం వర్తింపచేయడంవల్ల ప్రజలకు నిజంగా ప్రయోజనం చేకూరుతుంది. కానీ ఓ విఐపి కారుకు ఎర్రబుగ్గ ఉంటే ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటి? ప్రభుత్వం కల్పించే ఈ సౌకర్యాలకు ప్రజలందరు సమానమే అయినప్పుడు ఓ ఎమ్మెల్యేనో, మరో విఐపియో వారికంటె అధికుడెలా అవుతారు? అందుకేనేమో! మార్పును మోడీ అక్కడినుంచే ప్రారంభించారని పిస్తుంది. ఏప్రిల్ 19న కేంద్ర క్యాబినెట్ ఈ నిర్ణయం ప్రకటించగానే చాలా మంది కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ కార్లపై గల ఎర్రబుగ్గలను స్వయంగా తొలగించడం చూస్తే, ఎమ్మెల్యేలు, ఎంపీలు హడావుడిగా ఆ 'బుగ్గ'లను తీసివేయడం చూస్తే ఎంత చక్కని మార్పుకు మోడీ శ్రీకారం చుట్టారో అనిపిస్తుంది.

ఎర్రబుగ్గలు ఎవరు వాడాలో, నీలిబుగ్గలు ఎవరు వాడాలో ప్రొటోకాల్ నిబంధనల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ, ఆ నియమ నిబంధనలను తుంగలో తొక్కి రాజకీయగణం, అధికారగణం సొంత ప్రయోజనాలకోసం కార్లపై బుగ్గల వాడకాన్ని అధికం చేయడంతో అది ఇప్పుడు మొత్తంగా అదృశ్యం కావలసిన పరిస్థితి ఏర్పడింది. ఎర్ర బుగ్గనో, నీలిబుగ్గనో కార్లపై తగిలించుకోవడం, ఆ కార్లలో సంబంధిత విఐపిలు గాక ఒక్కొక్కసారి వారికి సంబంధించిన ఇతరులో లేక సాంఘిక వ్యతిరేక శక్తులో తిరగడం కూడా అధికం కావడం, తరచుగా అనేక ఆరోపణలు వస్తుండడంతో ఎట్టకేలకు కేంద్రం ఈ మార్పుకు నాంది పలికింది. బుగ్గకార్లు కనిపించేసరికి ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై చేసే 'నాట్యం' కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ బుగ్గకార్లలో ఉన్నవారికి ఎలాంటి ట్రాఫిక్ నిబంధనలు వర్తించవు. (అలా వారు భావిస్తుంటారు) ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ నుంచి, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి అన్ని పెద్ద నగరాలలో ఇందుకు ఉదాహరణలు నిత్యం ప్రతిక్షణం కనిపిస్తూనే ఉంటాయి. అలా నిబంధనలెరుగని బుగ్గకార్ల వల్ల సాధారణ ప్రజలు, ఇతర ముఖ్యులు ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొనడం కూడా జరుగుతూంటుంది. ఆ బుగ్గకారులో కూర్చున్నవారు ఈ భూమండలానికంతా తామే అధినాథులమనుకొంటూ చిద్విలాసంగా వ్యవహరించడం, వారి అడుగులకు మడుగులొత్తే ట్రాఫిక్ సిబ్బంది సాధారణ ప్రజలను కష్టాలకు గురిచేయడం కూడా సర్వసాధారణంగా కనిపించే దృశ్యం.

కొన్ని కార్లనుంచి వినిపించే సైరన్లు కూడా ప్రజలను తరచుగా కలవరపెడుతూంటాయి. అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలకు కొన్ని ప్రత్యేకమైన సైరన్లు కేటాయించారు. అవి రోడ్లపై అవరోధాలు లేకుండా అత్యవసరంగా వెళ్లాలి గనుక వాటిని ప్రజలు గుర్తించి దారి ఇవ్వడంకోసం ఆ సౌలభ్యం కల్పించారు. గంటల కారు అనేమాట అగ్నిమాపక వాహనాలకు అందుకే రూఢి అయిపోయింది. గంటలు వినిపిస్తూ ఏదైనా వాహనం స్పీడుగా వెళ్లిపోతోందంటే– ఎక్కడో ఏదో తగులబడిపోతోందని అందరికి అర్థమవుతుంది. అలా ఏదో ప్రత్యేక కారణం ఉంటేనే కొన్ని రకాల సైరన్లను ఆయా వాహనాలకు అనుమతిస్తూ వస్తున్నారు. కానీ తర్వాత అది రకరకాలుగా రూపాంతరం చెంది మామూలు విఐపిలు కూడా ఏదో ఒక సైరన్‌తో రోడ్లపై వెళ్లడం ఎక్కువ కావడంతో మోడీ ప్రభుత్వం ఆ సైరన్లపై కూడా ఆంక్షలు

విధించింది. ఇదో మరో ఆశావహమైన పరిణామమే. పోలీసు పైలట్ వాహనాలు మినహా మంత్రుల కార్లకు సైరన్లు వాడటం కూడా చట్టవిరుద్ధమే. అయినా కొన్ని కార్లు అలాంటి సైరన్లతో వేగంగా రోడ్లపై వెళ్లిపోవడం కూడా అందరికి తరచుగా అనుభవవైకవేద్యమే. అందుకే మోటారు వాహనచట్టంలో పలు సవరణలు చేయాలని కూడా కేంద్ర నిర్ణయించింది. అవి త్వరగా జరిగి అమలయితే మరి కొన్ని మంచి మార్పులు ప్రజలు అనుభవంలోకి రాగలవనిపిస్తుంది.

****

రాజకీయ నాయకులు, మరికొందరు విఐపిలకు కొన్ని రకాల ప్రత్యేక సౌకర్యాలు అవసరమా? అని సుప్రీంకోర్టు గతంలోనే ప్రశ్నించింది. వారికి అలాంటి సౌకర్యాలు పెరిగిపోవడంవల్ల సాధారణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అంటూ విఐపిలకు, ఇతర నేతలకు కల్పించే భద్రతా సౌకర్యాలను సమీక్షించవలసిందిగా కూడా సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఆదేశించింది. బుగ్గకార్ల సౌకర్యం ఎవరెవరికి కల్పించాలనే అంశంపై కూడా కొన్ని సూచనలు చేసింది. వాటిలో ఒకటి ఇంత కాలానికైనా అమలులోకి రావడం ఎంతైనా హర్షణీయం. సర్పంచ్‌ల నుంచి సచివులదాకా నేతలు, రాజకీయ ముఖ్యులు ప్రజలలోకి వచ్చినపుడు ఎలా వ్యవహరించాలనే విషయంపై సుప్రీంకోర్టుగాని, కేంద్రంగాని కొత్త నిబంధనలు రూపొందించి అమలు చేస్తే సమాజానికి మరింత ప్రయోజనం చేకూరుతుంది.

సిగ్నల్ వద్ద 'రెడ్‌లైటు పడితే ఎలాంటి వాహనమైనా ఆగిపోవాలి. లేకపోతే ఆ వాహనానికే ప్రమాదం ఎదురవుతుంది. కానీ ఏ కారుపైనైనా 'రెడ్ లైటు' ఉంటే దానికి ఎలాంటి పరిస్థితుల్లోనైనా దారి వదలాలి. అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాల వరకు అది సబబే. కానీ ఓ రాజకీయ ముఖ్యునికి ట్రాఫిక్ నిబంధనలన్నీ ఎందుకు దాసోహం అనాలి? మంత్రుల అనుచరులు ప్రయాణించే వాహనాలకు సైతం ట్రాఫిక్ సిబ్బంది ఎందుకు పచ్చ జెండా చూపాలి! ఇది ఏ ట్రాఫిక్ నిబంధనల్లోనూ లేదు కదా! ఎర్రలైటు సౌకర్యాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అనుచరగణం ఎంతగా దుర్వినియోగం చేస్తున్నాయో పరిశీలించిన తర్వాతనే సుప్రీంకోర్టు గతంలో కొన్ని సూచనలు చేసింది.

తన కారుబుగ్గను స్వయంగా తొలగిస్తున్న కేంద్రమంత్రి దత్తాత్రేయ

2013లో సుప్రీంకోర్టు వేసిన చురకలతో కేంద్రం కొన్ని చర్యలు తీసుకొన్నదిగాని అవి తాత్కాలికమే అయ్యాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వంటి రాజ్యాంగ పదవుల్లోని ఐదుగురు అత్యంత ముఖ్యులకు మాత్రమే ఎర్రబుగ్గలను పరిమితం చేయాలనీ, మిగిలిన వారందరికి ఆ సౌకర్యాన్ని ఉపసంహరించాలనీ అప్పట్లోని యుపిఎ ప్రభుత్వం ఒక నిర్ణయమైతే తీసుకొందిగాని దానిని ఆచరణలో పెట్టలేకపోయింది. అందుకు కారణం అనేక రకాల ఒత్తిడులే. 'సంకీర్ణ ధర్మం' అంటే ఏమిటో, ఎన్ని దుష్పరిణామాలకు కారణమవుతుందో అప్పటి యుపిఎ ప్రభుత్వం అక్షరాలా రుజువుచేసి చూపింది. దానిలో భాగంగానే ఎర్రబుగ్గలనూ అదుపు చేయలేకపోయింది. దాని ఫలితంగానే దేశంలో దాదాపు 6 లక్షల కార్లకు 'ఎర్రబుగ్గ'లు కనిపించే పరిస్థితి ఏర్పడింది. మరి అన్ని లక్షల మందికి ఆ సౌకర్యం కల్పించాలని రాజ్యాంగంలోనో, లేక కేంద్రం రూపొందించిన నిబంధనావళిలోనో ఎక్కడా చెప్పలేదు కదా! అయినా అవి యధేచ్ఛగా రోడ్లపై జారుకుంటూనే ఉన్నాయి.

నిబంధనల ప్రకారం జాతీయ స్థాయిలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, త్రివిధ దళాధిపతులు, ప్రధాని, ఉపప్రధాని, కేంద్రమంత్రులు, ప్రణాళిక సంఘ సభ్యులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, క్యాబినెట్ కార్యదర్శి ఎర్రబుగ్గను ఉపయోగించడానికి అనుమతి ఉంది. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎర్రబుగ్గను గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జడ్జిలు, టాప్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు వాడవలసి ఉండగా, బ్లూ బుగ్గను ముఖ్యమంత్రి, మంత్రులు, మరికొందరు కీలక ప్రజా ప్రతినిధులు (సిఎం అనుమతి ఉన్నవారు) వాడడానికి అర్హత ఉంది. తర్వాత దశలో జాబితా పెరుగుతూ వచ్చి కేబినెట్ ర్యాంక్ గల ముఖ్యులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు, మేయర్లు, ఎస్‌సి, బిసి వంటి కమిషన్ల చైర్‌పర్సన్లకు కూడా ఈ సౌకర్యం వర్తింపచేయడం ఆరంభించారు. ఆ తర్వాత ఒత్తిడులు మరింతగా పెరగడంతో నీలిబుగ్గకంటె ఎర్రబుగ్గ కావాలనుకొనేవారి సంఖ్య పెరగడంతో రాజధాని నగరాల్లోనేగాక జిల్లా స్థాయిలో కూడా అటువంటి కార్లు విచ్చలవిడిగా తిరగడం అధికమైపోయింది. ఎర్రబుగ్గలను కార్లపై బిగించి, వాటి ద్వారా లభించే సౌకర్యాలను, ప్రత్యేక మర్యాదలను చూసిన జిల్లా స్థాయి నాయకులు చివరికి కొందరు సర్పంచ్‌లు కూడా వాటిపై మోజు పెంచుకోవడంతో జిల్లా స్థాయిలోనే ఎర్రబుగ్గ కార్ల సంఖ్య ప్రస్తుతం 40 నుంచి 75 దాకా చేరే పరిస్థితి ఉంది. మోటారు వాహన చట్టం నిబంధనలను ఉల్లంఘించి కార్లకు ఎర్రబుగ్గలు బిగించడాన్ని నిరోధించే చర్యలు నిజానికి చాలా సంవత్సరాల క్రితమే తీసుకోవలసి ఉన్నా, రకరకాల రాజకీయ కారణాల వల్ల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉపేక్షిస్తూ వచ్చాయి. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం, అమరిందర్ సింగ్, ఆదిత్యనాథ్ వంటి కొందరు ముఖ్యమంత్రులు కేబినెట్ నిర్ణయంకంటె ముందే ఎర్రబుగ్గలను తీసివేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ కూడా 'ఎర్రబుగ్గలు' లేకుండానే కార్లలో వెళ్తున్నారు. ఈ దారిలో మిగిలిన వారందరు కూడా వెళ్తే ఒక 'వ్యర్థ విధానం' నుంచి రాజకీయం బయటపడినట్లవుతుంది. అనర్థాల బారినుంచి ప్రజలను కాపాడినట్లవుతుంది.

చట్టం ముందు అంతా సమానమే అన్నది నినాదాలకే పరిమితం గాక ప్రజలందరి అనుభవంలోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వమే ఇలాంటి మార్పులకు శ్రీకారం చుట్టవలసి ఉంటుంది. 'విఐపిలంటే కొందరు వ్యక్తులు మాత్రమే కాదు.. ప్రజలంతా విఐపిలే' అని ప్రధాన మోడీ వినిపించిన మాటలు మిగిలిన మంత్రులు, అధికారులు, రాజకీయ నాయకులందరు కూడా వినిపించుకొంటే నిజంగానే సమాజంలో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. కార్లపై ఎర్ర బుగ్గ ఉంటే దానిలోని వ్యక్తి అన్నిటికి అతీతుడనే ఆలోచన నుంచి ట్రాఫిక్ సిబ్బంది బయట పడడానికి కూడా కేంద్ర కేబినెట్ నిర్ణయం దోహదం చేస్తుందనిపిస్తుంది. వలస పాలకుల కాలం నాటి ఇలాంటి భేషజాలు ఇంకా చాలా ఉన్నాయి. కొందరు రాజకీయాలలోకి వస్తున్నది కూడా వాటికోసమే. ఏదో ఒక మార్గంలో సంపాదించిన కోట్లతో సంతృప్తి లేక, వాటితో అధికార సౌకర్యాలు కూడా 'కొనుగోలు' చేయడానికే ఎక్కువ మంది ఇప్పుడు ఎంతైనా ఖర్చు పెట్టి ఏదో విధంగా ఎమ్మెల్యే అయినా అవ్వాలనుకోవడం కనిపిస్తూంటుంది. అలా ఎమ్మెల్యే అవగానే ఎర్రబుగ్గనో, నీలిబుగ్గనో తగిలించుకొంటే చల్లటి కారులో ఆ హాయే వేరుగా, స్వర్గానికి రాచబాటలా ఉంటుందనుకొనేవారే ఎక్కువ. కానీ కేంద్రం తాజాగా తీసుకొన్న నిర్ణయం అటువంటివారి ఆశలు, ఆలోచనలపై తప్పక నీళ్లు చల్లుతుంది. అయితే వారు వాటికి ప్రత్యామ్నాయ మార్గాలు వెదుకకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం కూడా ఉంది.

మనం ఉంటున్నది రాచరిక వ్యవస్థలో కాదనీ, గణతంత్రంలో అధికారిక దర్పాలకు చోటు లేదనీ రాజకీయ నాయకులు ఇప్పటికైనా గ్రహించవలసి ఉంది. ఎర్రబుగ్గలు, సైరన్లు మే ఒకటవ తేదీనుంచి ఇక పూర్తిగా కనిపించకపోవడం, వినిపించకపోవడం ప్రజాస్వామ్య సంస్కరణల వైపు కేంద్రం వేసిన తొలి అడుగుగా చెప్పాలి. అలాగే విఐపిల భద్రతా సౌకర్యాలను కూడా సంస్కరించవలసి ఉంది.

'దాదా' విశ్వనాథ్

'కళాతపస్వి'కి ఘన పురస్కారం

కవర్ స్టోరీ

ఘంటా విజయ్‌కుమార్
సీనియర్ స్టాఫ్ రిపోర్టర్, వార్త, నందిగామ.

అది ప్రతి తెలుగువాడి హృదయం పరవశంతో ఆనంద నాట్యం చేసిన సమయం..ప్రతి మనసు సంతోషగానం చేసిన సమయం.. అదే కళా తపస్వి కాశీనాధుని విశ్వనాథ్‌కు 2016 సంవత్సరానికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించిన సమయం. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు కె.విశ్వనాథ్‌ను వరించి, తన ప్రతిష్ఠను ఇనుమడింపజేసుకొంది. భారతీయ చలనచిత్ర ఎదుగుదలకు, అభివృద్ధికి అవిరళ కృషి చేసిన వారికి ఇచ్చే ఈ అవార్డు కె.విశ్వనాథ్‌కు ప్రకటించడంతో అది సార్ధకమైందిగా భావించాలి. శాస్త్రీయ, సంప్రదాయ సంగీత, నృత్యాలను ఆయన తన ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా భావిస్తారు. పాశ్చాత్య నాగరికతపై మోజుతో శాస్త్రీయ సంగీతాన్ని నిర్లక్ష్యం చేస్తోన్న ప్రజను తన శంకరాభరణం చిత్రంతో మేల్కొల్పి, తమను తాము రియలైజ్ అయ్యేట్లు చేశారు. అంతేకాదు, అదే సమయంలో సమాజంలోని దురాచారాలను చిత్రించి, ప్రజలను చైతన్యవంతుల్ని చేశారు. ఆ తర్వాత ఆయన చిత్రాలు సాగర సంగమం, స్వర్ణకమలం, స్వాతిముత్యం, స్వాతికిరణం..ఇలా ఎన్నెన్నో చిత్రాలు శాస్త్రీయ సంగీత, నాట్యాల పునరుజ్జీవనం ప్రధాన ధ్యేయంగా వైవిధ్య కథలతో ప్రజలను అలరించాయి, ఆలోచింపజేశాయి. కళాతపస్వికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రాల విశిష్టతతో పాటు దాదా సాహెబ్ అవార్డు గురించి.. ఇప్పటివరకు ఈ అవార్డును అందుకున్న తెలుగు ప్రముఖల గురించి.. ఈవారం మీకోసం..

కళ ద్వారా కుడా వ్యక్తిత్వవికాసాన్ని కలిగించవచ్చునని నిరూపించిన గొప్ప మనోవికాస నిపుణుడు డాక్టర్ కాశీనాధుని విశ్వనాథ్. మంచి చలన చిత్ర సంచాలకునిగా ఆయన అవార్డులు, రివార్డులు, పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. ఇప్పుడు భారతీయ చలనచిత్ర పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే పేరిట ఏర్పాటుచేసిన గౌరవ పురస్కారం ఆయనకు లభించటం అభినందించదగిన విషయం. ప్రత్యేకించి నవ్యాంధ్ర కార్యనిర్వాహక రాజధాని విజయ వాడకు సమీపంలో పెదపులిపర్రు గ్రామంలో ఆయన జన్మించటం తెలుగువారికి గర్వ కారణం. పల్లె కట్టుబాట్లు, సంస్కారం ఓ మనిషిని ఉన్నత వ్యక్తిత్వానికి నిర్వచనంగా తీర్చిదిద్దుతాయన్నదానికి విశ్వనాథ్ ఓ నిదర్శనం. తన పల్లెలో కన్పించిన ప్రతి దృశ్యం, గుండెను తట్టిన మనోభావం, వ్యక్తులు, వారి మధ్య వ్యత్యాసాలు, వాటిని అధిగమించే మానవీయ సంబంధాలు ఆయనను ఓ అద్భుత జీవన కావ్యాల దృశ్య సంచాలకుని మాదిరిగా కనిపింపజేస్తాయి.

అందుకే ఆయన చిత్రాల్లో నటులకన్నా పాత్రలే ప్రేక్షకులతో స్నేహం చేస్తాయి. శాశ్వతంగా వారి స్మృతుల్లో నిలుస్తాయి. సంప్రదాయక నృత్యానికి, సంగీతానికి, తెలుగు గీతరచన పటిమకు ఆయన పెద్దపీట వేసాడనే మాట నిజమయినప్పటికి ఆయన చిత్రాల్లో జీవనవాస్తవాలు కన్పిస్తాయి. 1980లో విడుదలయిన శంకరాభరణంలో రసజ్ఞుల్లో నృత్యం, సంగీత మేళవింపు, మరుగున పడుతున్న పాశ్చాత్య కళలకు పునరుజ్జీవం కల్పించాలనే ఆలోచనను గమనింప చేస్తే, పామరులు, మధ్య తరగతి ప్రేక్షకులు ఓ సంస్కరణ వాదాన్ని, నిజాయితీని, అవ్యక్తప్రేమ భావాన్ని గమనిస్తారు. ఈ చిత్రంలో కథానాయకుడు శంకరశాస్త్రి అగ్రసామాజిక వర్గీయుడు. అతను ఆదరించిన కథానాయక కళావంతుల కుటుంబానికి చెందిన నృత్యకారిణి. కులవృత్తి జీవనం నుంచి నాట్యకళాకారిణిగా గుర్తింపు పొందాలనుకున్న ఆమెకు తన ఇంట స్థానం కల్పిసాదు శంకరశాస్త్రి. ఆమె అద్భుత నర్తకే కాదు నృత్య సంచాలకురాలుగా ఉంటుంది. శాస్త్రి గారి రాగాలు, శృతులకు అనుగుణంగా ఆమె నర్తిస్తుంది. నాట్యానికి, సంగీతానికి వున్న బంధాన్ని వివరిస్తూనే కళ ఏ మనో వికారానికీ ఆశ్రయం కల్పించని ఓ అద్భుత సహజ ప్రతిభ అని విశ్వనాథ్

చెబుతారు. ఈ చిత్రంలో శాస్త్రి తనను నమ్ముకున్నవారికి తనకు ఉన్నంతలో ఆర్థికంగా సహకరిస్తాడు.పల్లెజీవనంలో కన్పించే యాజమాన్య ధర్మాన్ని ఇక్కడ చూపిస్తాడు.సంగీత కచేరీల్లో తనకు వాయిద్య సహకారమందించిన సాక్షిరంగారావు (దాసు) తనకున్న దానిలోనే కొంత ఆర్థికంగా చేయూతనివ్వటం ద్వారా నమ్ముకున్నవారికి ఏ స్థితిలోనైనా అండగా వుండాలనే పల్లె సంస్కారం కన్పిస్తుంది, విషయమేమిటంటే కృష్ణాజిల్లా.. ప్రధానంగా తూర్పుకృష్ణా పల్లెల్లో ఇప్పటికీ ఇదే వాతావరణం. ఆర్ధికంగా దిగజారి నప్పటికీ నిన్నటి మోతుబారి కుటుంబాలకు ఈ నాటికీ తమ అనుచరగణానికి అండగా నిలుస్తూ ఉండటం.



ఇదే సినిమాలో కథానాయక చేత మడికట్టిస్తాడు. ఆచారం వ్యవహారాలు, సంప్రదాయక కట్టుబాట్లు సామాజిక వర్గాలు ప్రధానం కాదని స్పష్టంచేస్తాడు. ఈ చిత్రం లోనే కథానాయక అజ్ఞాతంలోకి వెళ్ళి, కుమారునితో పునర్ దర్శనం చేస్తుంది. ఆమెకు తన కొడుకు గురవంతటి వాడు కావాలన్నది లక్ష్యం. ఆ క్రమంలో ఎదురు పడతాడు న్యాయవాది. ఆయన అప్పటి వరకు ఆమె ఆస్థికి సంరక్షకుడిగా ఉంటాడు. కథానాయక కన్పించగానే ఆ విషయం చెప్పి ఆస్తి అప్పగిస్తాడు. అదే జరుగకకుంటే చిత్ర కథ మరోరీతిలో సాగేది. నిజాయితి, నిక్కచ్చితనం ఇక్కడ దర్శన మిస్తుంది. అందువల్లే 'శంకారభరణం' చిత్రం క్లాసికల్‌గానేకాదు, మాస్ చిత్రంగా కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది.

'సప్తపది' చిత్రం అనుకున్నంత ప్రేక్షకాదరణ అందుకోలేదు కాని, ఇది సమాజంలో పాతుకునిపోయిన సామాజికవర్గ భావజాలంపై గురిచూసి ఎక్కుపెట్టిన చిత్రం. దుర్గాష్టకంలో అమ్మవారి విశిష్టతను గురించి మాత్రమే ఉంటుందనుకునే వారికి ఈ చిత్రం వాస్తవిక విషయాంశం తెలుసుకోవాలనే జిజ్ఞాసను కలిగిస్తుంది. చిత్రంలో కథా నాయకుడు రవికాంత్ (ఈయన వృత్తిరీత్యా పండితుడు, అర్చక స్వామికుడా) తన భార్యను తొలిపర్యాయం శోభనం గదిలో చూసినప్పుడు ఆమెలో తాను నిత్యం ఆరాధించే దుర్గను చూస్తాడు. అహం మానవ జీవితానికి ఓ దుర్భేధ్య దుర్గం. అహం వీడితే అంతా శక్తిమయం. అవును సర్వజనాన్ని అమ్మ అంతరంగ దర్శనం, అమ్మ సర్వకాల సర్వావస్థల్లో నిజాన్ని చూస్తుంది, చూపిస్తుంది. భారతీయులు నమ్మినవాదం, వేదసారాంశం.

"స్వాతిముత్యం" చిత్రంలో జీవితంలో అనేకమందికి వెర్రితనంగా కన్పిస్తుంది గాని పల్లెలో నేటికీ కలుషితంగాని మానవీయ ధర్మంలోని విశిష్టతను కథానాయకుని ప్రవర్తన ద్వారా చూపిస్తుంది. పల్లె మనుస్సులు రాముడిని ఎలా ఆరాధిస్తాయో, అల్లాను, ఏసును అలాగే గౌరవిస్తాయి. "కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం, రెప్పపాటు ఈ జీవితం, దీన్ని తెలుసు కోవటం ఎలా" అంటాడు ఓ సూక్ష్మ కవితలో చంద్రహస్. సరిగ్గా ఈ అంతులేని రహ్యాసాన్ని 'స్వాతిముత్యం'లో శివయ్య ఓ మృతుని శవాన్ని స్వర్గపురికి మోసుకుని వెళ్ళే సందర్భంలో అన్యాపదేశంగా చెబుతాడు. ప్రేమ అన్నింటికి అతీతమయ్యింది. వితంతు వివాహాన్ని గురించి ఈ కథలో ప్రస్తావించా డనుకుంటాం. ఎన్నో విచిత్రమయిన మనోతత్వాలు ఈ చిత్రంలో కన్పిస్తాయి. ఈ చిత్రంలోనే రాములోరి పెళ్ళిలో మొత్తం పల్లెలోని అన్ని వర్గాల జనం భాగస్వామ్యం కన్పిస్తుంది. ఇంకా ఆంధ్ర పల్లెలో చాలావరకు ఈ సంఘటితం కన్పిస్తుంది. వర్గ వ్యత్యాసాలు ముదురుతున్న నేటి విషసంస్కృతి నడుమ ఇప్పటికీ జాతరలు, తీర్ధాలు, కల్యాణోత్సవా లలో పల్లెలోని సమస్త జన ఐక్యత కన్పిస్తుంది.

విశ్వనాధుని చిత్రాలు సంప్రదాయక విలువలకు, ప్రాచీన కళలకు అద్దంపట్టాయనే సందర్భంలో ఆయన ఓ సామాజిక వర్గ ప్రాధాన్యతను చూపించారనే విమర్శలకు ఆయన చిత్రాలను లోతుగా అధ్యయనం చేసే ఓ మనోవిశ్లేషకుడు కన్పిస్తాడు. ఇదే విషయం 'సాగరసంగమం'లోను కన్పిస్తుంది. ఇద్దరు మెగాస్టారులు నందమూరి తారక రామారావు, చిరంజీవులతో ఇంచుమించు ఒకే కథనంతో చిత్రాలను నిర్మించి ఆయన ప్రేక్షక ప్రశంసలను అందుకున్నారు. 'స్వయంకృషి' చిత్రంలో చిరంజీవి, విజయశాంతిలనుంచి అపూర్వ నటనను రాబట్టారు. ఆయన చిరంజీవితో శుభలేఖ, స్వయంకృషి, ఆపద్బాంధవుడు చేసారు. మూడూ హిట్టే. ఇందులో ఆపద్బాంధవుడు ఫ్లాప్ అనే ప్రచారం జరిగినా నిర్మాత, బయ్యర్లు ఆర్థికంగా

దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అలా మొదలైంది..

భారత ప్రభుత్వం 1969లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును నెలకొల్పింది. మనదేశంలో తొలి పూర్తినిడివి ఫీచర్ ఫిలిమ్ రాజా హరిశ్చంద్ర'ను అందించిన, భారతీయ చలనచిత్ర పితామహుడు'గా ప్రఖ్యాతిచెందిన ఫాల్కే (1870-1944) సేవలకు గురుతుగా దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'ను ఏర్పాటుచేసింది. భారతీయ చలన చిత్రరంగానికి విశిష్టకృషి చేసినవారికి ఈ అవార్డును అందిస్తారు. చలనచిత్రరంగంలో ఇది అత్యున్నత పురస్కారం. ఈ అవార్డు.. ఓ స్వర్ణకమల మెడల్, శాలువా, లక్షరూపాయల నగదుతో కూడి ఉంటుంది. తొలిసారిగా ఈ అవార్డును భారతీయ చలనచిత్ర తొలినటిగా పేర్గాంచిన ప్రఖ్యాత నటి దేవికారాణి అందుకున్నారు. ఆ తర్వాత ఎందరెందరో మహామహులు..

ఆర్థికంగా లాభపడ్డారు.

'సిరివెన్నెల' చిత్రంలో ఆయన చేసిన ప్రయోగం అద్భుతంగా ఉంటుంది. అన్నాచెల్లెళ్ళయిన గాయకుడు, రచయిత్రి, వ్యాఖ్యాతలను ఓ కళాభిమాని ఎలా అత్యుత్తమ ప్రతిభావంతులుగా చేసింది వివరిస్తారు. కథానాయక మాటరాకున్నా సంస్కారమున్న చిత్రకారిణి. ఓ కళాకారునిలోని కళను గుర్తించి వెలుగులోకి తెచ్చిన కళంకిత తాను వృద్ధిలోకి తీసుకుని వచ్చిన కళాకారుని జీవితంలో ఎవ్వరు తోడుగా ఉండాలో గుర్తించి తనువు చాలిస్తుంది. ఈ చిత్రం నిజంగానే మనోచైతన్య దృశ్య పుటం. ఆయన చిత్రాల్లో నటులకన్నా పాత్రలే ప్రేక్షకులకు గుర్తు వుండటానికి కారణం అవన్నీ నిత్యజీవితంలో తారసపడటం. ఆయన ఎన్టీఆర్, ఎఎన్ఆర్, నాగార్జున, బాలకృష్ణలతో నిర్మించిన చిత్రాల్లోను పాత్రలే గుర్తుంటాయి. ఫాల్కే పురస్కారం ఆయనకు ఆలస్యంగా వచ్చినప్పటికి తెలుగువారు ఎప్పటికైనా మా విశ్వనాథ్‌ను గుర్తించారనే నిండయిన బోళాతనం వ్యక్తమవుతుంది.

విశ్వనాథ్‌లో ఓ మంచినటుడు దాగివున్నాడు. నటసార్వభౌమ ఎస్వీరంగారావు మాదిరిగా ఆయన ముఖకవళికల్లోనే భావోద్వేగాలను పండించగలరు. ఆయన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం లభించటమంటే తెలుగుచలనచిత్ర దర్శకుల దార్శనికతకు నిదర్శనం. విలువలతో కూడిన చిత్రాలు విశ్వనాథ్ చిత్రాలు!

దాదా ఫాల్కే అవార్డునందుకొన్న తెలుగు సినీ ప్రముఖులు

దాదాసాహబ్ ఫాల్కే అవార్డు ఇప్పటి వరకు ఆరుగురు తెలుగు సినీ ప్రముఖులను వరించింది. వారి గురించి క్లుప్తంగా...

బి.ఎన్.రెడ్డి: ఈయన పేరు చెప్పగానే ఎవరికైనా గుర్తువచ్చే తెలుగు చిత్రం మల్లీశ్వరి...అద్భుత దృశ్యకావ్యం. ఈయన పూర్తిపేరు బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి. 1908లో నవంబరు 16న కడపజిల్లాలోని కొత్తపల్లిలోని ఓ రైతు కుటుంబంలో జన్మించారు. బి.ఎన్.రెడ్డి వందేమాతరం, దేవత చిత్రాలను నాగయ్య హీరోగా తీశారు. 1951లో ఎన్టిఆర్, భానుమతిలతో మల్లీశ్వరి చిత్రాన్ని తీసి సినీచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇంకా భాగ్యరేఖ, రాజ మకుటం, పూజాఫలం, సుమంగళి, స్వర్గసీమ, బంగారుపంజరం మొదలైన మంచి చిత్రాలకు దర్శకత్వం వహించారు. దక్షిణాదినుంచి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న తొలి వ్యక్తి ఈయనే. అంతేకాదు ఇండియన్ చిత్రరంగానికి సంబంధించి డాక్టరేట్ ఆఫ్ లెటర్స్ గౌరవాన్ని అందుకున్న తొలి వ్యక్తి కూడా ఈయనే. 1955లో బంగారు పాప (బెస్ట్ ఫీచర్ ఫిల్మ్) చిత్రానికి రాష్ట్రపతి నుంచి రజత పతకాన్ని అందుకున్నారు. 1966 లో రంగులరాట్నం చిత్రానికి (బెస్ట్ ఫీచర్ ఫిల్మ్) జాతీయ ఫిలిమ్ అవార్డ్ అందుకున్నారు. 1974లో బి.ఎన్.రెడ్డిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది.

ఎల్.వి.ప్రసాద్:



చిత్ర నిర్మాత, నటుడు, దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ అయిన ఎల్.వి.ప్రసాద్ పూర్తిపేరు అక్కినేని లక్ష్మీ వరప్రసాదరావ్. 1908 జనవరి 17న ఏలూరులోని సోమవరప్పాడులో వ్యవసాయక కుటుంబంలో జన్మించారు. తెలివితేటలున్నా చదువుమీద శ్రద్ధ పెట్టలేదు. 17వ ఏట మేనమామ కూతురుతో వివాహం. ఆపైన ఓ పాప పుట్టడం. ఇంటి ఖర్చులు పెరగటం, దాంతో పాటు రుణభారం పెరగటంతో తండ్రికి గడ్డుపరిస్థితి ఎదురైంది. ఆ పరిస్థితుల్లో ఎల్.వి.ప్రసాద్ దృష్టి సినిమారంగంపై పడింది. మొట్టమొదటగా వీనస్ ఫిలిమ్ కంపెనీలో ఎర్రండ్ బాయ్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఇండియా పిక్చర్స్‌కు మారారు. 1931లో 'స్టార్ ఆఫ్ ది ఈస్ట్' మూకీ సినిమా లోఅఖ్తర్ నవాజ్ ప్రసాద్‌కు ఓ చిన్ని వేషం ఇచ్చారు. మనదేశంలో తొలి టాకీ చిత్రం ఆలమ్ ఆరాలోనూ నటించారు. హెచ్.ఎమ్.రెడ్డితో పరిచయం కావటంతో తొలి తమిళ టాకీ కాళిదాసులోను, ఆ తర్వాత తెలుగు తొలి టాకీ 'భక్తప్రహ్లాద'లోనూ నటించారు. ఆ తర్వాత కుటుంబంతో సహా బాంబే (ముంబై) చేరారు. అలీ షా దర్శకత్వం వహించిన కమర్-అల్-జమాన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ వేషం దొరికింది. అప్పుడే ఆయన పేరు ఎల్.వి.ప్రసాద్‌గా కురచనయింది. ఆతర్వాత కష్టజీవి చిత్రానికి ప్రొడక్షన్ సూపర్‌వైజర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం..కానీ ఆ సినిమా మూడురేళ్ల నిర్మాణంతోనే ఆగిపోయింది. అయితే పృథ్వీ రాజ్‌కపూర్‌తో పరిచయం కావటంతో పృథ్వీ థియేటర్స్‌లో చేరాడు. రాజ్‌కపూర్‌తో పరిచయం..తన తొలి హిందీ చిత్రం 'శారద'కు రాజ్‌కపూర్ హీరో. ఆతర్వాత 1946లో 'గృహప్రవేశం' చిత్రంలో డైరెక్టర్‌గానూ, హీరోగానూ కూడా రాణించారు. 'ద్రోహి'లో ఓ ముఖ్య పాత్ర..1949లో ఎన్టిఆర్ హీరోగా 'మనదేశం' చిత్రం తీసి పేరొందారు. షావుకారు, సంసారం చిత్రాలు ఆయనకు మంచి పేరుతెచ్చాయి. ఆ తర్వాత 'రాణి' హిందీచిత్రం..జూపిటర్ ఫిలిమ్స్‌వారి మాగ్నమ్ ఓపస్ 'మనోహర' చిత్రాన్ని శివాజీగణేశన్ హీరోగా తమిళ్, తెలుగు, హిందీలలో తీశారు. ఆతర్వాత ప్రసాద్ ఫిలిమ్ ల్యాబ్స్ (చెన్నై-1974) స్థాపించారు. ప్రసాద్ ప్రొడక్షన్స్ పతాకంపై మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్‌దూజేకేలియే వంటి బాక్స్ ఆఫీస్ హిట్స్ ఎన్నో తీశారు. 1962లో భార్యభర్తలు చిత్రానికి తెలుగులో ఉత్తమ ఫీచర్ ఫిలిమ్‌గా నేషనల్ అవార్డ్ అందుకున్నారు. 1982లో దాదాసాహెబ్ ఫాల్కే వరించింది. 1980లో రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు.

బి.నాగిరెడ్డి:

బి.నాగిరెడ్డి, బి.ఎన్.రెడ్డి సోదరులే. ఈయన 1912లో డిసెంబర్2న జన్మించారు. చిత్ర నిర్మాత అయిన నాగిరెడ్డి నాటి మద్రాస్‌లో విజయ, వాహినీ స్టూడియోస్ ఏర్పాటుచేశారు. పాతాళ భైరవి, మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ, మదువె మడినోడు (కన్నడ), రామ్ ఔర్ శ్యామ్, శ్రీమాన్ శ్రీమతి, జూలీ, స్వర్గ నరక్ మొదలైన ఎన్నో హిట్ చిత్రాలు నిర్మించారు. 1960 దశకంలో ఫిలిమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు రెండుసార్లు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

నాగిరెడ్డి, తన మిత్రుడు ఆలూరి చక్రపాణితో కలిసి నాలుగు దశాబ్దాల కాలంలో నాలుగు దక్షిణాది భాషలలో, హిందీలో యాభైకి పైగా చిత్రాలు నిర్మించారు. వీటిలో పౌరాణిక, భక్తిరస ప్రధానమైన, చరిత్రాత్మక తెలుగుచిత్రాలెన్నో ఉన్నాయి. పాతాళభైరవి, మిస్సమ్మ,

మిస్సమ్మలకు వచ్చిన ఖ్యాతి ఎనలేనిది.

కన్నడ చిత్రం మదువే మడినోడు (1965) చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నేషనల్ ఫిలిమ్ అవార్డ్ అందుకున్నారు. 1986లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 1987లో ఆం.ప్ర. ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డునందించింది. తమిళనాడు ప్రభుత్వం 1972లో కలైమామణి అవార్డునిచ్చింది. శ్రీకృష్ణదేవరాయ, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లు అందించాయి.

అక్కినేని నాగేశ్వరరావు:

ఎఎన్ఆర్‌గా పాపులర్ అయిన అక్కినేని నాగేశ్వరరావు 1924లో సెప్టెంబరు 20న గుడివాడలో జన్మించారు. 1941లో పదిహేడేళ్ల వయసులో 'ధర్మపత్ని' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఘంటశాల బలరామయ్య అనుకోనట్లుగా ఆయనను విజయవాడ రైల్వే స్టేషన్‌లో చూడటం, తాను నిర్మించే 'సీతారామ జననం' చిత్రంలో రాముడి పాత్రకు ఎంపిక చేసుకోవటం జరిగింది. 1955లో 'దొంగరాముడి'లో నటనతో ఆయన కెరీర్ ఉచ్ఛదశనందుకుంది. అదే సంవత్సరం ఆయన నటించిన 7 సినిమాలు విడుదలయ్యాయి. దేవదాసుగా, బాటసారిగా, లైలామజ్నులో మజ్నుగా ఎఎన్ఆర్ నటన ప్రేక్షకుల మదిని విపరీతంగా చూరగొంది. అర్థాంగి, మూగమనసులు, మాంగల్యబలం, గుండమ్మకథ, డాక్టర్ చక్రవర్తి, ధర్మదాత, దసరా బుల్లోడు, , ప్రేమనగర్, ప్రేమాభిషేకం, మేఘసందేశం ..ఇలా ఎన్నో వైవిధ్య భరిత చిత్రాలలో ఆయన నటన ప్రేక్షకులను కట్టిపడేసింది. ఇక భక్తిరస చిత్రాలు విప్రనారాయణ, మహాకవి కాళిదాసు, భక్త జయదేవ, భక్త తుకారాం మొదలైన చిత్రాలలో ఆయన తనదైన నటనతో అలరించారు. 2006లో శ్రీరామదాసులో కబీరుగా, 2009లో శ్రీరామరాజ్యంలో వాల్మీకిగా నటించి మెప్పించారు. చివరిగా తమ కుటుంబచిత్రం 'మనం'లో సైతం మరపురాని నటనను ప్రదర్శించారు. నటసామ్రాట్ అక్కినేని అందుకొన్న అవార్డులకు లెక్కేలేదు. భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్‌లతో ఎఎన్ఆర్‌ను సన్మానించింది. 1991లో నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్‌లో 'దాదా సాహెబ్ ఫాల్కే' అక్కినేనిని అలంక రించింది. 1989లో రఘుపతి వెంకయ్య అవార్డు, 1996లో ఎన్‌టిఆర్ నేషనల్ అవార్డ్ అందుకున్నారు. ఉత్తమ నటుడిగా 1964 లో (డాక్టర్ చక్రవర్తి), అంతస్తులు (1965). సుడిగుండాలు (1967), మేఘసందేశం (1982), బంగారు కుటుంబం (1994) చిత్రాలకు అందుకున్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాళిదాసు కౌస్తుభ్ పురస్కా రం అందించింది. స్టేట్ ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అడ్వయిజర్‌గా కూడా కొంతకాలం పనిచేశారు. నటుడిగా, నిర్మాతగా విస్తృతఖ్యాతి గడించిన ఎఎన్ఆర్ తెలుగు సినీ పరిశ్రమ 1960లో మదరాసునుంచి హైదరాబాద్‌కు తరలడంలో ప్రముఖంగా నిలిచారు.

డి.రామానాయుడు:

అత్యధిక చిత్రాలను నిర్మించిన వ్యక్తిగా గిన్నిస్ బుక్ రికార్డును సాధించిన దగ్గుబాటి రామానాయుడు 1936లో జూన్ 6న ప్రకాశం జిల్లాలోని కారంచేడులో ఓ వ్యవసాయక కుటుంబం లో జన్మించారు. కారంచేడు, చీరాలలో చదువు సాగించి, ఆ తర్వాత మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేశారు. రైస్ మిల్ ఓనర్‌గా కెరీర్ ప్రారంభించిన రామానాయుడు ఆ తర్వాత రవాణా వ్యాపారం చేశారు. ఆ సమయంలో వారి తండ్రి ఓ బంధువుతో వచ్చారు. ఇద్దరూ కలిసి నమ్మినబంటు (1958) చిత్రాన్ని నిర్మించారు. ఆచిత్రంలో అక్కినేని డూప్‌గా రామానాయుడు నటించారు.

ఆ తర్వాత ఎఎన్ఆర్ సలహాపై రైస్‌మిల్ బిజినెస్ నిలిపివేసి, 1962లో మద్రాస్ చేరారు. 1963లో తన మిత్రులు తగిరిశ హనుమంతరావ్, యార్లగడ్డ లక్ష్మయ్యలతో కలిసి అనురాగం' చిత్రం నిర్మించారు. అది కమర్షియల్‌గా కలిసిరాలేదు. ఆతర్వాత సొంతంగా సురేష్ ప్రొడక్షన్స్ స్థాపించి రాముడు భీముడు' (1964) చిత్రం నిర్మించారు. అది బాక్స్ ఆఫీస్ హిట్ అయింది. ఆపైన ప్రతిజ్ఞా పాలన, శ్రీకృష్ణ తులాభారం, స్త్రీ జన్మ, పాపకోసం, సిపాయి చిన్నయ్య చిత్రాలెన్నో నిర్మిచారు. 1971లో బి.నాగిరెడ్డి కుమారులతో కలిసి విజయ సురేష్ కంబైన్స్‌ను స్థాపించి కొన్ని సినిమాలు తీశారు. అక్కినేని, వాణిశ్రీలతో ప్రేమ్‌నగర్ తీశారు. అది బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ అయి, తమిళం, హిందీలలో రీమేక్ చేయడం జరిగింది. 1983లో హైదరాబాద్‌లో రామానాయుడు స్టూడియోస్‌ను ఏర్పాటుచేశారు.

దిల్‌దార్, తోఫా, అనారి, హమ్ ఆప్‌కె దిల్‌మే రహతే హై, ఆఘాజ్ మొదలైన హిందీ సినిమాలు నిర్మించి ప్రజాదరణ పొందారు. తెలుగు, తమిళంలో ఎక్కువగా చిత్రాలు నిర్మించినా, కన్నడ, హిందీ, మలయాళం, మరాఠి, బెంగాలీ, ఒరియా, గుజరాతి, భోజ్‌పురి, పంజాబిలలో కూడా పాదంమోపారు. 13 భారతీయ భాషల్లో 130కి పైగా చిత్రాలను నిర్మించిన ఖ్యాతి రామానాయుడిది. ఆయన కొన్ని చిత్రాల్లో నటించారు కూడా.

2007లో 'హోప్' తెలుగు చిత్రంలో తొలిసారిగా పూర్తి నిడివిలో నటించారు. చదువుల ఒత్తిడితో యువతలో ఆత్మహత్యలు పెరగటమనే అంశంతో తీసిన ఈ చిత్రానికి అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ అదర్ సోషల్ ఇష్యూస్ లభించింది. 2012లో రామానాయుడికి భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం అందించింది. 1999లో అసుఖ్ చిత్రానికి బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఇన్ బెంగాలీగా నేషనల్ ఫిల్మ్ అవార్డ్ లభించింది. 2009లో అత్యంత ప్రతిష్టాత్మకమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది.

ఆంధ్ర వైభవం, ప్రేమించు చిత్రాలకు నంది పురస్కారాలు లభించాయి. 2006లో రఘుపతి వెంకయ్య అవార్డు రామా నాయుడికి లభించింది. తమిళంలో కూడా ఆయన అవార్డులందు కున్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌నందించింది. 1999-2004 కాలంలో ఆయన బాపట్ల నియోజకవర్గంనుంచి ఎంపిగా కూడా ఉన్నారు.

ఇలా తెలుగు చిత్ర రంగంలో దాదాలుగా ఖ్యాతి గడించి, దాదా సాహెబ్ ఫాల్కే నందుకుని తెలుగువారి కీర్తిని ఇనుమడింపజేసిన వారు వీరు గాక 42 మంది ఇతర భాషా చిత్రాల ప్రముఖులున్నారు. సామాన్యుడి నుంచి అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుని కేవలం వినోదమే కాక, విజ్ఞానాన్ని, చైతన్యాన్ని, సందేశాన్ని, దార్శనికతను అందించేవి సినిమాలు.

ఇటువంటి పురస్కారాలు విశిష్ట వ్యక్తులకు గౌరవం అందించడంతో బాటు ఆ రంగంలోని యువ కళాకారులకు, నిర్మాతలకు, దర్శకులకు స్ఫూర్తిదాయకాలవుతాయి. అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు నందుకోవాలన్న తపనతో చిత్తశుద్ధితో కృషిచేస్తే మంచి చిత్రాలు వచ్చే అవకాశాలుకూడా పెరుగుతాయి. ముమ్ముందు మన తెలుగు చిత్ర సీమ మరిన్ని దాదా ఫాల్కేలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షిద్దాం. తాజాగా కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్‌కు దాదా ఫాల్కే దక్కడం సినీరంగంలోని అందరిలో నూతనోత్తేజాన్ని నింపుతుందనడంలో సందేహంలేదు. తన చిత్రాలతో ప్రేక్షకులను ఆలోచింపజేసి, వివేకం, విచక్షణలను బోధించిన కళాతపస్వికి ప్రణతి..ప్రణతి..ప్రణతి!

భజ గోవిందం..

నేడు ఆది శంకరాచార్య జయంతి

జీవుడు, దేవుడు వేరుకాదని అద్వైతం తెలుపుతుంది. రెండూ వేరని తెలిపేది ద్వైతం. రెండు విశేష వస్తువులు కలిగిన ప్రపంచంలో శాశ్వతంగా ఉండటం విశిష్టద్వైతం. దేవుడు ప్రకృతిని, దానిని అనుభవించే జీవుని స్వభావం కూడా కలిగి ఉన్నాడని విశిష్టాద్వైతం తెలుపుతోంది. అద్వైత సిద్ధాంతాన్ని ఆదిశంకరులు, విశిష్టా ద్వైతమతాన్ని శ్రీరామానుజులు, ద్వైత సిద్ధాంతాన్ని శ్రీమధ్వాచార్యులు ప్రచారంచేశారు.

జీవి అవివేకం, కర్మ, మాయ అనే త్రిగుణాలతో బంధింతుడై ఈశ్వరుని గ్రహించలేడు. ఆత్మ రాగద్వేషాలకు అతీతమైనపుడు భగవదనుగ్రహం కలుగుతుంది. ఆత్మ భగవంతునిలో ఐక్యం చెంది ఆనందావస్థను పొందుతుంది.

రెండువేల ఐదువందల సంవత్సరాలకు పూర్వం ఆస్తికత్వం తగ్గుముఖం పట్టగా జీవులలో దైవసంబంధ విషయ ఆసక్తిని ఆరాధనను పెంపొందించేందుకు శివాజ్ఞతో శివస్వరూపంగా జన్మించినవారు ఆదిశంకరులు. కేరళలోని కాలడిలో ఆర్యాంబ శివగురువులనే దంపతులకు సంతానం లేదు. సంతానానికై వారు త్రిచూర్ వెళ్లి వడక్కునాథన్ (శివుడు) స్వామిని 48రోజులు పూజించి ఆ స్వామి ఆశీస్సులతో ఆది శంకరులను పుత్రునిగా వరప్రసాదంగా పొందారు. వైశాఖ శుక్ల పంచమినాడు ఆదిశంకరులు జన్మించారు. ఆదిశంకరుల నాల్గవ ఏటనే తండ్రి గతించారు. ఐదవ ఏట గురుకులంలో విద్యాభ్యాసం చేస్తూ ఉండగా ఒకరోజు భిక్షకై ఒక ఇంటి ముంగిట ఆగారు శంకరులు. నిరుపేద అయిన ఆ ఇంటి ఇల్లాలు ఇంటిలో భిక్ష ఇచ్చేందుకు ఏమీ లేని కారణంగా ఒక ఉసిరికాయను భిక్షగా వేసింది. వారి కదుపేదస్థితికి చలించిన ఆదిశంకరులు శ్రీమహాలక్ష్మిని కనకధారాస్తవంతో ప్రార్థించగా లక్ష్మీదేవి కరుణించి ఆ నిరుపేద గృహిణి ఇంటి ముంగిట బంగారు ఉసిరికాయల వర్షాన్ని కురిపించి వారి దుస్థితిని తొలగించింది. నర్మదానది వరదకు గురి అవుతుందని గ్రహించి తన కమండలంలో నది ఉధృతిని నిలిపిన ఆదిశంకరుల అపారశక్తిని గ్రహించిన శ్రీగోవింద భగవత్పాదులు ఆనందించి తన శిష్యునిగా స్వీకరించి వివిధ వేదాల సారాన్ని ఆదిశంకరులకు బోధించారు.

ప్రతి మానవుడు దైవాంశ గలవాడని, దీన్ని నలుమూలలా ప్రచారం చేయవలసిందిగా ఆయన, ఆదిశంకరులను ఆదేశించారు. వారణాశిలో శిష్యులతో కూడి విశ్వనాథుని దర్శనానికై బయలుదేరారు శంకరులు. ఒక పంచముడు నాలుగు కుక్కలతో ఎదురురాగా శిష్యులు అతణ్ని దూరంగా తొలగిపొమ్మని కోరారు.

అందుకు ఆ పంచముడు "మీ అద్వైత సిద్ధాంతం ప్రకారం అన్ని జీవులు భగవత్ స్వరూపాలే కదా! మరి నన్నెందుకు తొలగి పొమ్మని చెబుతున్నారు. మీ పరమాచార్యులకు, నాకు బేధం లేదుకదా" అని

ప్రశ్నించాడు. ఆది శంకరులు, ఆ వచ్చిన వ్యక్తి సాక్షాత్తు కాశీవిశ్వనాథుడే అని గ్రహించి మనీషా పంచకాన్ని ఆశువుగా స్తుతించారు. కరుణారసతరంగుడైన ఆ కాశీ విశ్వనాథుడు విశాలాక్షి సమేతంగా ఆదిశంకరులకు దర్శనం ఇచ్చి ఆశీర్వదించాడు. ఆదిశంకరులు రచించిన బ్రహ్మసూత్రభాష్యాలపై ఒక తపస్వి వాదించాడు. ఆ వాదన ఎన్నో రోజులు గడిచింది. ఆది శంకరుల వాదనా పటిమకు, అపార మేధోసంపదకు సంతసించిన ఆ తపస్వి భాష్యరచన సరైన దని తెలిపారు. ఆ తపస్వి వేద వ్యాసుడు, "నేను నీ భాష్యాలపై సంతృప్తిచెందాను. 16 సంవత్సరాల వయసుగల నీవు మరొక 16 సంవత్సరాలు జీవించి అద్వైత ప్రచారాన్ని కొనసాగించు" అని వేదవ్యాసులు వరమిచ్చి ఆశీర్వదించారు.

మాహిష్మతీ నగరంలో మండన మిశ్రుడనే పండితుని కర్మ మీమాంసలో ఓడించి సతీ సమేతంగా తన శిష్యులలో చేర్చుకున్నారు. తుంగభద్రానది ఒడ్డున గల కర్ణాటకలోని శృంగేరి చేరారు. అక్కడ శారదా పీఠాన్ని నెలకొల్పారు.

శృంగేరిలో ఉండగా మాతృమూర్తి అవసానదశలో ఉన్నదని గ్రహించి కాలడి వెళ్లి మాతృమూర్తిని దర్శించారు. ఆమె సంతోషించింది. గతంలో తాను ఇచ్చిన మాటకు కట్టుబడి అవసానదశలో తల్లిని చేరి ఆమె కోరిక తీర్చి ఎవరు కాదన్నా తల్లి అంత్యక్రియలను స్వయంగా జరిపించారు. అవసానదశలో శ్రీమన్నారాయణుని ప్రార్థించి ఆమెకు స్వామి దర్శనాన్ని ప్రసాదింపజేసి పరమపదం చేరేలా అనుగ్రహించారు. దేశం నలుమూలలా పర్యటించి అద్వైతాన్ని ప్రచారంచేశారు. ఆదిశంకరులు వైదిక మత పరిరక్షణకై శతాధిక గ్రంథాలను రచించారు. 19 భాష్య గ్రంథాలను రచించారు. అందులో దశోపనిషద్భాష్యం, బ్రహ్మసూత్ర భాష్యం, భగవద్గీత భాష్యం ముఖ్యమైనవి. వీటినే ప్రస్థాన త్రయ భాష్యములంటారు. 40 వేదాంత ప్రకరణ గ్రంథాల్ని అందించారు. ఎన్నో స్తోత్ర గ్రంథాలు, లఘుగ్రంథాలు, శివానంద లహరి, సౌందర్య లహరి వంటి అమూల్యమైన పుస్తకరాజాల్ని ప్రజాళికి ప్రసాదించారు. శ్రీ శంకర భగవత్పాదులు హిమగిరిపై బదరికాశ్రమంలో భాష్యాలను రచించారని అంటారు. శివానందలహరిని శ్రీశైలంలో పాలధార, పంచధార ప్రదేశంలో రచించారు. కాళేశ్వరం, ముక్తేశ్వర, బాసర సరస్వతీ ఆలయాల్ని సందర్శించారు. ఆదిశంకరులకు సాక్షాత్తు శివుడు స్వయంగా ప్రసాదించిన 5 స్ఫటిక లింగాలు..కేదార్‌నాథ్‌లో ముక్తిలింగం, నేపాల్‌లో వర లింగం, శృంగేరిలో భోగలింగం, చిదంబరంలో దేవసభలో మోక్షలింగం, కంచిపీఠంలో యోగలింగంగా పూజలందుకుంటున్నాయి.

అవసాన కాలంలో కడతేరుటకు వ్యాకరణ సూత్రాలు ఉపకరించవనే నిజం తెలుసుకుని గోవిందనామాన్ని భజించమని..జీవన్ముక్తి పొందుటకు సత్ సాంగత్యమే తరుణోపాయమని, సజ్జనులతో స్నేహంచేసి మంచి విషయాలని గ్రహించాలని, అపుడే మానవుని లోని మనోవాక్కాయ కర్మలు దివ్య చైతన్యంతో నిండి జ్ఞానజ్యోతి ప్రకాశిస్తుందని తన భజగోవింద శ్లోకాలలో సూచించారు. అద్వైత మత సిద్ధాంతాలకు గట్టి పునాదులు వేసి అంతకు ముందు చెలరేగిన మత కల్లోలాలను పారద్రోలిన దైవాంశ సంభూతులు శ్రీ జగద్గురు ఆదిశంకరులు.

-మల్లాది రామలక్ష్మి

కృతి

బి.సి. అస్తిత్వవాద కవిత్వం..



ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం, దళిత వాదం, మైనారిటీ వాదాలు నిలదొక్కుకున్నంతగా బి.సి.వాదం బలపడలేదన్నది నిజం. అసంఖ్యాకమైన బి.సి.సాహితీకారులు సాహితీసృజన చేస్తున్నప్పటికీ వారి సాహిత్యం బి.సి.అస్తిత్వ వాద సాహిత్యంగా గుర్తింపుబడకపోవడం గమనార్హం. కారణాలు అనేకం. తాజాగా కొందరు యువకవులు 'సమూహం'గా ఏర్పడి బి.సి.ల సమస్యలను ఫోకస్ చేస్తూ 41 కవితా కెరటాలతో విరుచుకుపడు తున్నారు. శ్రామిక, ఉత్పత్తి, చాకిరీ కులాల ప్రతినిధులుగా ఈ బి.సి. కవులు వినిపిస్తున్న సామూహిక గానంలోని స్వరతీవ్రత పాఠకులను ఆలోచనల్లోకి నెట్టేస్తుంది.

'చచ్చి చరిత్రకెక్కిన వాళ్లలో నా వాళ్లెందరు?'; కుమ్మరి చక్రం కేవలం మట్టి చక్రం కాదయా..మా బతుకు చక్రం'; ఇంకా మనూరి టీకొట్లో టీ గ్లాసుల్లా మనం దూరంగానే ఉన్నాం'; సమానత్వం.. చచ్చాక కూడా దక్కడంలేదు'; బి.సి.అంటే బ్యాక్ బోన్ క్లాస్'.యిలా కవితా వాక్యాల్లో తమ అస్తిత్వ వాదాన్ని బలంగా వినిపిస్తారు కవులు. ఈ పుస్తక సంకలన కర్త డా.చింతం ప్రవీణ్ కుమార్ చేసిన ఈ మంచి ప్రయత్నం అభినందనీయం.

(సమూహం: బి.సి.అస్తిత్వవాద యువకవిత్వం-బి.సి. రైటర్స్ వింగ్ సంపాదకుడు: డా.చింతం ప్రవీణ్‌కుమార్; వెల: రూ.100; ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాలు)

-రమణ వెలమకన్ని

అన్ని కాలాలకూ అన్వయించే కథలు!



అన్ని కాలాలకూ అన్వయించే కథలు రాసే సత్తా కొందరు రచయితలకే ఉంటుంది. అలాంటి వారిలో ఇల్లిందల సరస్వతీదేవి ఒకరు. 1943 నుంచే విస్తృతంగా కథలు రాసిన చేసిన ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతా రెడ్డి సంపాదకత్వంలో 'ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు' పేరిట నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వెలువ రించిన పుస్తకంలో కొన్ని కథలను ప్రస్తావించుకుందాం. తొలి కథ 'అబ్బిగాడు'లో పాత్రచిత్రీకరణ అద్భుతం. ఏ సౌఖ్యాలూ అబ్బిగాడిని అవ్వను మరిపించలేకపోవటం, చివరకు వాడు కనపడకుండా పోవటం పాఠకుడు కథతోడి ఆలోచనల్లోనే ఉండిపోతాడు. ఆడపిల్ల పుడుతుందని తెలిస్తే అబార్షన్ సమకాలీన అంశం అనుకుంటాంగానీ ఆ కాలంలోనే ఆమె ఈ అంశంపై 'అమ్మా! నాకు ప్రాణంతో పుట్టే హక్కులేదా?' పేరుతో చక్కటి కథరాశారు. 'కాంట్రాక్ట్ మేరేజి' కథలో జాస్మిన్‌లాంటి మహిళలు ఈ సమాజంలో ఎందరో. 'తల్లి-కొడుకులు' కథ కూడా అంతే. విదేశాలకు వెళ్లిన కొడుకులు తమ అవసరార్థం తల్లిని పిలిపించుకుని, తల్లిని పనిమనిషిలా చూడటం.. ఇదీ నేటి కథే. 'ఓ స్త్రీ! నీకు రక్షణఎక్కడ? ఎక్కడ?' కూడా నేటి పరిస్థితులకు అద్దంపట్టేదే. ఇందులోని అన్ని కథలూ చదివి తీరాల్సినవే.

(ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు-సంపాదకులు: ముదిగంటి సుజాతారెడ్డి; వెల:రూ.225; ప్రతులకు: నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా, నెహ్రూభవన్,5, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్- II, వసంత్‌కుంజ్,న్యూఢిల్లీ-110070)

-జె.శ్యామల

ఇవీ అందాయి

చిన్నారి కప్ప షికారు:
అమర్ గోస్వామి.. అనువాదం:గుడిపల్లి అనిత;
వెల:రూ.35

నలుపు-తెలుపు: సయ్యద్ అసద్ అలీ;
అనువాదం:వేణు సంకోజు;
వెల:రూ.40

వెదురు కర్రల ఇల్లు: నీరాజైన్; అనువాదం:
బండారు జయశ్రీ; వెల:రూ.40

కుక్కపిల్ల టామీ-తుంటరి కాకి
తనుక బౌమిక్ ఎండో;
అనువాదం: వెల్దండి శ్రీధర్; వెల:రూ.40

పై పుస్తకాల ప్రతులకు
సంచాలకులు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా
నెహ్రూభవన్, 5, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా,
ఫేజ్- II, వసంత్ కుంజ్, న్యూఢిల్లీ-110070

కాళిదాసుని రఘువంశము (తెలుగులో ప్రతిపదార్థ
తాత్పర్య భావార్థ వివరణతో ప్రథమ సర్గము.
చింతగుంట సుబ్బారావు; వెల:రూ.60
ప్రతులకు: చింతగుంట సుబ్బారావు
4-102, ఐఎల్‌టిడి కాలనీ, ఎక్స్‌టెన్షన్, కొత్తపేట
పేరాల (పోస్ట), చీరాల-523157

సామాజికాంశాల ప్రతిబింబం



కవి హృదయాలు సున్నితాలు. ఏ కొద్ది ఉద్వేగానికి లోనైనా చలించి, ఆ వేడి వారి అక్షరాల్లో ప్రజ్వరిల్లుతుంది. వారి కలం నిశ్శబ్ద సవ్వడులను ఆలపిస్తుంది. అలాంటి సవ్వడిలోంచి ఆవిర్భవించినవే కాట్రోజు లావణ్య సైదీశ్వర్ 'కలంసవ్వడి'లోని కవితలు. అది రైతన్న ఎదుర్కొనే కష్టం కావొచ్చు, దవాఖానలో చేరలేక దవాఖాన ముందే పురుడుపోసుకున్న అభాగిని కావొచ్చు, మురికివాడలో బతుకు ఈడుస్తున్న బడుగుజీవి కావొచ్చు, యంత్రాల కుతంత్రాల నీడల్లో ఆకలికేకలు వేస్తున్న నేతన్న కావొచ్చు లేదా ఊపిరి గొట్టాల నిండా పొగమారిన కార్మికుడి జీవితం కావొచ్చు..ఇవన్నీ కవయిత్రి కలంలో అలవోకగా సవ్వడులు చేస్తాయి. నాగేటి సాలల్లో నెలతప్పిన నేలమ్మ, గుండెపగిలిన పల్లె పటం, తల్లి కడుపులో ఆడ శిశువు, ఏకాంతపు ఆలోచనలు, ఆవేశం, జీవనది, వృద్ధులు, అమ్మ, నాన్న..ఒక్కటనేంటి తాను కన్నవీ, విన్నవీ మనోనేత్రంతో అనుభూతించినవీ..ఇవన్నీ కవితా వస్తువులై కవయిత్రి కలంనుంచి జాలువారాయి. రైతన్నను కాపాడుకోకపోతే, రైతుకు కోపంవస్తే లోకానికి ఆకలంటే ఏంటో తెలుస్తుందన్న ముందుచూపు కనబరుచుతుంది. పుణ్యక్షేత్రం ఎక్కడోలేదని అమ్మ అనురాగమే పుణ్యక్షేత్రమని, తను పాతాళంలోకి కూరుకుపోతూ, కుటుంబాన్ని శిఖరంపై చేర్చడానికి నాన్న జీవనపోరాటం సలుపుతుంటాడని చెప్పటం గొప్ప అభివ్యక్తీకరణ. వస్తువైవిధ్యం, శిల్పం, శైలి..అన్నిటా సమతూకం పాటించారు.

(కలం సవ్వడి-కవితా సంపుటి:కాట్రాజు లావణ్య సైదీశ్వర్; వెల: రూ.90; ప్రతులకు: ప్రముఖ పుస్తక విక్రేతలు)

-కూర చిదంబరం

క్రౌర్యాన్ని గెలిచిన ప్రేమ!

కస్తూరి మురళీకృష్ణ

'శ్వేత పుష్పం' నిద్రలేచిందా?' ప్రేమగా తన కూతురు 'సాక్ నిక్తే'ను నిద్రలేపాడు 'మయాపన్' రాజు అహాహునాక్ సీల్.

అయిదేళ్ల అందమైన పాప కళ్లు తెరిచింది. తండ్రిని చూసి నవ్వింది. రెండు చేతులు అతని మెడలో వేసి బుగ్గలపై ముద్దిచ్చింది. ఆపై కిలకిల నవ్వుతూ, చెంగున మంచంపై నుంచి దూకి బయటకు పరుగుతీసింది.

'నా కూతురు పేరుకు తగ్గట్టు శ్వేతపుష్పమే' గర్వంగా అనుకున్నాడు ఆమె తండ్రి.

****

'మొద్దు ఇంకా నిద్రలేవలేదా?' కోపంగా అరిచాడు చిచెన్ ఇట్జా రాజు.

సేవకులు భయంతో వణికారు. ఒకడు ధైర్యం చిక్కబట్టుకుని 'ఎంతలేపినా లేవటంలేదు ప్రభూ!' అన్నాడు.

కళ్లెర్ర చేశాడు రాజు. పళ్లు పటపటా కొరికాడు. 'వెధవకు బద్ధకం పెరిగింది. మధ్యాహ్నం అవుతోంది. ఇంకా నిద్ర లేవకపోవటం ఏమిటి?' అరిచాడు.

'రాత్రంతా తోటలో తిరిగాడు ప్రభూ. కనబడ్డ జీవులన్నిటినీ కొట్టి చంపుతున్నాడు. తెల్లారే వొచ్చి పడుకున్నాడు'.

'వేడినీళ్లు..సలసలకాగే నీళ్లు వీపుమీద పోసి నిద్రలేపండి' ఆజ్ఞాపించాడు రాజు.

****

'మీ అమ్మాయి కరుణసాగరం లాంటిది. మనుషులే కాదు జంతువులు, పశు, పక్ష్యాదులు కూడా ఆమె కరుణ సాగర తరంగాలతో తన్మయులవుతున్నాయి. అటు చూడండి' రాజుకు అటువైపు చూపించాడు మంత్రి.

తోటలో రాకుమారి సాక్ నిక్తె చుట్టూ పిట్టలు చేరి ఉన్నాయి. కొన్ని ఆమె భుజం మీద కూడా వాలి ఉన్నాయి. ఆమె వాటికి ప్రేమగా ధాన్యపు గింజలను వేస్తోంది.

దూరంగా నిలబడి కుందేళ్లు, లేళ్లు ఈవైపే చూస్తున్నాయి. పిట్టలు ఎగిరిపోగానే వాటి స్థానాల్ని ఆక్రమించేందుకు సిద్ధంగా ఉన్నాయవి.

****

అది చూస్తున్న అందరూ హాహాకారాలు చేశారు.

కానీ రాకుమారుడిని వారించే ధైర్యం కానీ 'వొద్ద'ని చెప్పే తెగువ కానీ ఎవరూ ప్రదర్శించలేకపోయారు.

రాకుమారుడు 'కానెన్'కు అడవిలో ఓ గుంటలో చిక్కుపడ్డ లేడి కనిపించింది. వేగంగా పరుగెడుతూ పెద్ద గుంటను దాటేందుకు ఎగిరినట్టుంది జింక. కానీ దాని అంచనా ఏదో పొరపాటవటం వల్ల అది గుంటలో పడి కాళ్లు విరగ్గొట్టుకుంది. నిస్సహాయంగా గుంటలో పడి ఉన్న దాన్ని వెలికి తీయాలని రాజభటులు ప్రయత్నిస్తే వారిని వారించాడు రాకుమారుడు.

అతడు దానికి సహాయం చేస్తాడేమోనని భావించారు భటులు.

కానీ గుంటలోకి దిగిన రాకుమారుడు 'కానెన్' కత్తితీసి లేడి తలను నరికాడు.

దాని గుండెను వెలికి తీశాడు.

అలా వెలికి తీసిన గుండెను మాయమంత్రాల అధిదేవతలకు అర్పించాడు.

అతడిని చూసి అందరూ భయంతో వెనుకడుగు వేశారు.

రాకుమారుడిది అసాధారణమైన క్రౌర్యం అని వారందరికీ తెలుసు. జంతువులనే కాదు, మనుషులనూ క్రూరంగా హింసిస్తాడని తెలుసు. కానీ నిస్సహాయంగా ఉన్న లేడిని చంపి, దాని గుండెను క్షుద్రదేవత లకు అర్పించటం వారిలో భయంతో పాటు రాకుమారుడంటే అసహ్యాన్ని కూడా పెంచింది.

****

స్నేహితురాళ్లతో కలిసి పొరుగు రాజు పట్టాభిషేకం చూసేందుకు వెళ్లింది సాక్ నిక్తె. మామూలు దుస్తులలో ఉన్న ఆమె అందం నల్లటి మేఘాల చాటునుండి తొంగిచూసే వెన్నెల వెలుగులా ప్రస్ఫుట మవుతోంది.

చిచెన్ ఇట్జా

ఆవైపు చూసినవారంతా వెనుతిరిగి చూడకుండా ఉండలేకపోతున్నారు. అమెపై పడిన వారి దృష్టి వెనుక్కు తిరగి రానంటోంది.

తాను మరో రాజ్యానికి రాకుమారిని అన్న విషయం మరచి సరదాగా సామాన్యులతో కలిసి తిరుగుతున్న సాక్ నిక్తెకు అక్కడ గుమిగూడిన ప్రజల గుంపులలోనుంచి ఒద్దన్నా కొన్ని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

'రాకుమారుడు బాల్యం నుంచే క్రూరుడు. రాక్షసులు కూడా వీడి క్రౌర్యం చూసి దడుసుకుంటారు. ఇప్పుడిక రాజ్యాధికారం దొరికింది. ఏంచేస్తాడో?'

'ఇక రాజ్యం వదలిపోవాల్సిన రోజులు వచ్చేశాయి. చీల్చుకుని తినే క్రూరమృగాలు ఆకలి వేసినప్పుడే వేటాడతాయి. కానీ వీడికి వేటాడటం ఒక ఆట. ఎదుటి వాడిని ఏడ్పించటం వినోదం. ప్రాణాలు తీయటం అన్నిటికన్న వినోదం కలిగించే ఆట. భగవంతుడా మాకు ఎలాంటి కష్టాలు రాసిపెట్టావు?'

'వీడు చిన్నప్పుడు సీతాకోక చిలుకల రెక్కలు పీకాడు. ఎదుగుతూంటే జంతువుల గుండెలు తీశాడు. ఇప్పుడు రాజయి ఏంచేస్తాడో?'

ఇవన్నీ రాజ్యాధికారం చేపట్టబోతున్న రాకుమారుడి గురించి ప్రజలు అనుకుంటున్న మాటలు అని తెలిసిన రాకుమారి ఆశ్చర్యపోయింది.

'ఇలాంటి మనుషులు కూడా ఉంటారా?' అనుకుంది.

ఆమెకు క్రౌర్యం అన్నది ఒకటి ఉంటుందని తెలియదు. ఆమె ప్రపంచమంతా సున్నితమైన భావనలతో, సౌమనస్కులతో నిండి

ఉంది. క్రౌర్యం, కౌటిల్యం, కాపట్యం ఆమెకు తెలియవు. అందుకే అతడు ఎవరో చూడాలని ఆమెలో కుతూహలం జనించింది.

'క్రూరులు, రాక్షసులుఎలా ఉంటారో చూడాలని ఉంది' పక్కనే ఉన్న చెలికత్తెతో అంది.

అంతలో అక్కడ కలకలం చెలరేగింది.

'ఊరేగింపు వస్తోంది..ఊరేగింపు వస్తోంది'

అంతలోనే అన్నిటినీ మించి పాటగాళ్ల పాటలు వినిపించాయి. పలురకాల వాయిద్యాల ఘోష వినిపించింది. నృత్యం చేస్తున్న నృత్యగత్తెలు కనిపించారు.

అంతలో ఎత్తయిన పీఠంపైన కొత్తగా అధికారం చేపట్టిన రాజు 'కానెన్' కనిపించాడు.

ఎందుకో అతడిని చూడగానే సాక్ నిక్తె హృదయం ఝల్లుమంది.

'క్రూరులు ఇంత ఆకర్షణీయంగా ఉంటారా?' అనుకుంది.

అందరి వందనాలను ఆనందంగా అందుకుంటున్న కొత్తరాజు 'కానెన్' ఎందుకో ఆమెవైపు చూశాడు.

ఇరువురి చూపులు చిక్కుపడ్డాయి. ముడిపడ్డాయి. విడిపోయాయి.

అంతమందిలోనూ ఆమెను చూడగానే ఎందుకో కానెన్ మనస్సులో ఏదో అలవికాని ఆనందం, ఆపై అర్థంలేని విషాద భావన కలిగాయి.

ఒక్కసారిగా ఊపిరి అందనట్టు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

శరీరం నుంచి తాను వేరైన భావన కలిగింది.

ఎందుకో ఆమెవైపు చూసే అర్హత కూడా తనకు లేదన్న భావన కలిగిందతనికి.

ఆమె నుంచి వెలువడుతున్న మానవత్వపు పరిమళం తన శరీరంలో ప్రవేశించి అణువణువునూ సుగంధ భూయిష్టంగా మారుస్తున్నట్టనిపిస్తోందతనికి.

అంతలోఊరేగింపు ముందుకు వెళ్లిపోయింది.

కానీ ఆమె దర్శనం తాలూకు అనుభూతి అతడిని వదలటంలేదు.

అతడికి రాత్రంతా నిద్రపట్టలేదు.

ఆమెని చూసినప్పటినుంచీ అతనికి తన జీవితంలో అంతవరకూ తాను చేసిన దుష్కృత్యాలు ఒక్కొక్కటీ స్ఫురణకు రాసాగాయి.

ప్రతి చిన్ని క్రౌర్యం కూడా గుర్తుకు రాసాగింది.

సిగ్గుతో చితికిపోసాగాడు. అసహ్యంతో వణికిపోసాగాడు. పశ్చాత్తాపాగ్నిలో దగ్ధమవసాగాడు.

ఆమె దర్శనంతో తనలోని రాక్షసుడు నశించి మానవుడు తల ఎత్తినట్టు అనిపిస్తోంది అతనికి.

మరుసటి రోజు మంత్రులను పిలిచి చెప్పాడు.

'రాజ్యంలో ఎవరిపట్ల ఎలాంటి హింస జరగకూడదు. ఎవరికీ అన్యాయం జరగకూడదు.

అతడి మాటలు విని అందరూ ఆశ్చర్యపోయారు.

ఈ దుష్టుడి పాలనను తట్టుకోవటం కష్టం అని భూమిని.. ఒకరొకరుగా రాజోద్యోగం వదిలేయాలని నిశ్చయించుకున్న వారు తొందరపడి తమ నిర్ణయం ప్రకటించనందుకు సంతోషించారు.

****

అతడిని చూసినప్పటినుంచి సాక్ నిక్తెకు ఎలానో ఉంది.

ఏ పనిమీదా మనసు నిలవటంలేదు. ఎవరినీ కలవాలనిపించటంలేదు. ఎవరితోనూ మాట్లాడాలనిపించటంలేదు.

శూన్యంలో చూస్తూ కూర్చోవాలనిపిస్తోంది. ఆరోజు కనిపించిన అతడిని ధ్యానిస్తుండాలనిపిస్తోంది.

తనకేమైందో ఆమెకు అర్థంకావటంలేదు.

తనని ఎందుకని ఇలా భావిస్తోందో కూడా ఆమెకు తెలియటంలేదు.

అతడిని మళ్లీ చూడాలనిపిస్తోంది.

చూస్తే ఏమి చేస్తుంది? కలిస్తే ఏం చేస్తుంది? ఆమెకూ తెలియదు.

ఇంతలో ఓ రోజు ఆమె ఒంటరిగా తోటలో కూర్చుని ఉన్నప్పుడు, అతడు ఆమె దగ్గరకు వచ్చాడు.

ఆమె కరగి నీరైపోయింది. తాను పూర్తిగా నశించి కొత్తగా జన్మ ఎత్తినట్టు అనిపించింది. కానీ ఇరువురూ ఏమీ మాట్లాడుకోలేదు. ఒకరివైపొకరు చూసుకుంటూ కూర్చుండిపోయారు.

'చీకటిపడింది. లోపలకు రమ్మ'ని ఆమెకు పిలుపు వచ్చింది.

అతడు నీడల్లో కలిసిపోతూ 'నువ్వు నా దానివి. నేను నీ వాడిని' అన్నాడు.

ఆమె ఆ మాటలే స్మరిస్తూండిపోయింది.

****

'సాక్నిక్తె' వివాహం. 'ఉక్స్ మల్' రాకుమారుడు ఉలిల్‌తో స్థిరమయింది. వివాహం తేదీ కూడా నిశ్చయమైంది.

వార్త విని దిక్కుతోచని వాడయ్యాడు కానెన్.

'ఏంచేయాలి?' మంత్రులను అడిగాడు.

'ప్రభూ..మేం మీ తరపున అడిగాం. కానీ ఆమె తండ్రి ఒప్పుకోవటం లేదు'

'సాక్ నిక్తె ఏమంటోంది?'

'ఆమెనే సందేశం పంపించింది'

'ఏమని?'

'నువ్వు నా వాడిని. నేను నీ దాన్ని అని. అది అర్థంకావటం లేదు'.

దిగ్గున లేచాడు కానెన్.

'మీరంతా నాకోసం ఏమైనా చేస్తామన్నారుకదా?'

'మేమేకాదు, మన రాజ్య ప్రజలంతా మీమాట జవదాటరు. మీకోసం ప్రాణాలు అర్పిస్తారు'.

తల ఊపాడు కానెన్.

****

' పెళ్లి మంటపంలోంచి పెళ్లికూతురు సాక్ నిక్తెను క్రూరుడు కానెన్ ఎత్తుకుపోయాడు'

కార్చిచ్చులా వార్త అన్ని దేశాలకూ పాకింది.

ఉలిల్‌కూ, సాక్ నిక్తె తండ్రికి అందరూ సానుభూతి వ్యక్తంచేశారు.

పెద్ద సైన్యంతో కానెన్ సామ్రాజ్యంపై దాడిచేవాడు.

కానీ ఆశ్చర్యం!

రాజ్యంలో ప్రజలు లేరు. అంతా ఖాళీ!

రాజు, రాణిలతో సహా అందరూ రాజ్యం వదలి వెళ్లిపోయారు.

వాళ్లకోపం హద్దులు దాటింది. మొత్తం 'చిచెన్ ఇజ్జా' నగరాన్ని వాళ్లు బూడిదచేశారు.

అప్పటినుంచీ ఆ నగరం ఈనాటి వరకూ నిర్మానుష్యంగానే ఉంది.

కానీ మాయన్ నాగరికతలో అమరప్రేమకు ప్రతీకగా 'సాక్ నిక్తె, కానెన్‌ల ప్రేమగాథ నిలిచిపోయింది. వారి గాథ ఈనాటికీ కథలుగా, సినిమాలుగా, నాటకాలుగా, పాటలుగా ప్రజలకు అందుతూనే ఉంది.

తేడాలు గుర్తిస్తారా

దారేది?

పిల్లలూ! పై పాప ముందున్న 3 దారుల్లో ఏ దారిలో వెళితే కప్ కేక్‌ను చేరుకుంటుందో గుర్తిస్తారా?



విశ్వాసం

కథ

గ్రహపతి చాలా ధనవంతుడు. ఒకసారి వ్యాపారం పనిపై పట్నం వెళ్లి జట్కాబండిలో తిరిగి తన ఊరికి వస్తున్నాడు. దారిలో ఒక దుండగుడు అమాంతం గ్రహపతిపై దాడిచేసి తనచేతిలోని డబ్బుల సంచిని లాక్కోబోయాడు. జట్కా నడుపుతున్న వ్యక్తి వృద్ధుడు కావడంతో దుండగుడిపై దాడిచేయలేక భయపడిపోయాడు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో ఒక కుక్క ఆ దుండగుడిపై దాడిచేసి, విరుచుకు పడి పిక్క కొరికింది. దుండగుడు భయపడి పారిపోయాడు.

గ్రహపతి ఆనందించి తనను కాపాడిన కుక్కను ఇంటికి తెచ్చుకున్నాడు. నిజానికి గ్రహపతి చాలా పిసినారి. ఇతరుల కోసం ప్రాణంపోయినా డబ్బు ఖర్చుపెట్టేవాడు కాదు. తనను దుండగుడి బారినుండి రక్షించిందని కొత్తలో ప్రతిరోజు కుక్కకు మంచి ఆహారాన్ని ఇచ్చాడు. కొంతకాలం గడిచింది. ప్రతినెలా కుక్కకు పెట్టిన ఆహారం ఖర్చు వివరాలు లెక్కించాడు గ్రహపతి.

'ఈ కుక్కకు పెట్టే ఆహారం ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. ఏదో ఒకసారి కాపాడిందని లేనిపోని తలనొప్పిని నాతో తెచ్చుకుని డబ్బు వృధా చేసుకుంటున్నాను' అని గ్రహపతి ప్రతిరోజు వాపోసాగాడు. ఆరోజునుండి కుక్కకు ఆహారాన్ని తగ్గించాడు. రెండు రోజుల పాటు కూడా ఎటువంటి ఆహారాన్ని ఇచ్చేవాడు కాదు. కుక్క చిక్కి శల్యమై నీరసించింది. అయినా గ్రహపతికి దానిపై జాలి కలగలేదు.

ఒకరోజు రాత్రి ఆకస్మికంగా ఈదురుగాలి వచ్చింది. వీధి విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు తెగిపడి గ్రహపతి ఇంటి ఆవరణలో పడ్డాయి.

ఇంతలో చావడిలో ఉన్న ఆవుపై ఏదో బరువైన వస్తువు పడటంతో బాధ తాళలేక అది అరవడం మొదలెట్టింది. ఆవు ఎందుకు అరుస్తోందో అర్థంకాక చూడటానికి గ్రహపతి ఇంటి ఆవరణలోకి వచ్చాడు. అతను తెగిపడి ఉన్న విద్యుత్‌తీగను తొక్కబోయాడు. ఆ దృశ్యాన్ని కుక్క చూసింది. తన యజమానికి విద్యుత్ ఘాతం నుండి కాపాడాలనే ఉద్దేశంతో అమాంతం తెగి పడి ఉన్న విద్యుత్ తీగలపై దూకింది. తీగల్లో విద్యుత్ ప్రసరించడంతో విద్యుత్ ఘాతానికి గురైన కుక్క గిలగిలా కొట్టుకోసాగింది. గ్రహపతి జరిగింది అర్థంచేసుకునేలోపలే కరెంటు పోయింది. దాంతో తీగల్లో విద్యుత్ లేకపోవటంతో కుక్క ప్రాణాపాయ స్థితినుంచి బయటపడినప్పటికీ తీవ్రమైన గాయాలైనాయి. మనిషిగా పుట్టి మానవత్వాన్ని మరచి తనను రక్షించిన కుక్కకు సరైన ఆహారం ఇవ్వనప్పటికీ అది రెండోసారి కూడా అతడి ప్రాణాన్ని కాపాడింది. మూగజీవికి ఉన్న విశ్వాసం కూడా దానిపట్ల తాను చూపనందుకు గ్రహపతి సిగ్గుపడ్డాడు. ఈ సంఘటన అతడిలో పెనుమార్పుతెచ్చింది. వెంటనే కుక్కకు వైద్యం చేయించి మంచి ఆహారం ఇవ్వడం మొదలుపెట్టాడు. అంతేకాదు, తనను సాయం కోరిన వారికి సైతం కాదనకుండా వీలైనంత వరకు ఆదుకొని అందరి ప్రశంసలు అందుకున్నాడు.

–షేక్ అబ్దుల్ హాకీం జాని, తెనాలి.

వార్త ఆదివారం

ప్రగతి దీపాలు

భవితకు బాటలు
నవతకు చైతన్యాలు
సమతకు నెలవులు
మమతల వెలుగులు
బాలలే!
బాలలు లేని ఇళ్లు
అంధకారాల లోగిళ్లు
బాలలే కదా ప్రగతి దీపాలు
బాలల పలుకులే కదా
పెద్దలకు తేనియలు
కపటంలేదు, కల్మషం రాదు
ఒకేమాటగ కలిసి కదలి
సాగుతారీ బాలలు!
బడిలో చదువు
గుడిలో వెలుగు
నాటి, నేటి బాలలు!
బాలలు లేనిదే
జగతి లేదు
అందుకే బాలలందరికి
పలుకుదాం స్వాగతం!

-రావూరి నరసింహవర్మ, బాపట్ల.

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

-పి.వంశీకృష్ణ, హైదరాబాద్.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఏడో తరగతి చదువుతున్నాను. పక్షులు ఏడాదిలో కొంతకాలం ఇతర ప్రాంతాలకు వలసపోతుంటాయి కదా. వాటికి ఏడాదిలో సరిగ్గా అదే కాలంలో వలసపోవాలన్నది ఎలా తెలుస్తుంది? దయచేసి చెప్పండి.

జవాబు: వంశీకృష్ణా! వలస పక్షులు ఏడాదిలో ఒక నిర్ణీత నెలలోగానీ, వారంలోగానీ వలస వెళ్లే మాట వాస్తవమే. ఈ విషయమై జీవశాస్త్రజ్ఞులు రేడియో ట్రాన్స్‌మీటర్లు, రాడార్, ఉపగ్రహాలు మొదలైన వాటి సాయంతో అధ్యయనాలు సాగించారు. పక్షుల వలసకు అనేక కారణాలున్నా, ప్రధానమైన కారణం అక్కడి వాతావరణానికి తట్టుకోలేకపోవడమే. ఇక ఆహారం కొరత, కొత్త ప్రదేశానికి వెళ్లాలని, జతకోసం, తమకు సరిపడ్డ వాతావరణం కోసం పక్షులు తరచు వలసపోతుంటాయి. రుతువుల మార్పు పక్షుల వలసకు దోహదం చేస్తుంది. వాతావరణంలో వచ్చే మార్పు ఆధారంగా కొన్ని పక్షులు వలసపోతాయి. తమ వలస ఎప్పుడో అవి కొన్ని వారాల ముందరే నిర్ణయించుకుంటాయి. తమ వలస ప్రయాణానికి తగినట్టుగా ఆహారం స్వీకరించి, శరీరంలో కొవ్వుల్నిపెంచుకొని, తమ ప్రయాణాన్ని సాగిస్తాయి. వలస పోవడానికి ఒక నిర్ణీత కాలాన్ని నిర్ణయించుకొని, సంవత్సరంలో అదే కాలంలో వలసపోవటం జీవశాస్త్రజ్ఞులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పక్షులకు అంతర్గత క్యాలెండర్ ఉంటుందని శాస్త్రజ్ఞులు తెలియజేస్తున్నారు. వెర్టబ్రేట్స్‌లో అయితే ఈ అంతర్గత క్యాలెండర్‌ను మెదడు ఉత్పత్తిచేసే హార్మోన్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. హైపోథాలమస్, పిట్యూటరీ గ్లాండు, పీనెల్ గ్లాండ్‌లు కూడా అంతర్గత క్యాలెండర్‌ను నిర్ణయిస్తాయి. ఈ హార్మోన్లు పక్షుల సైకాలజీ, గుణాలపైన ఎంతగానో పనిచేస్తాయి. సరైనకాలాన్ని ఎంచుకోవటానికేకాదు, విజయవంతమైన వలసకు హార్మోన్లుతోడ్పడుతాయి. గాలి, నీటి ప్రవాహాలు, ఉష్ణోగ్రతలో మార్పు, భూమిజాడలు, వాసనలు దిశను గుర్తించటంలో వాటికి సహకరిస్తాయి.

జి.వాసంతి, గుంటూరు.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. సముద్రపు నీరు ఉప్పగా ఎందుకుంటుంది? దయచేసి చెప్పండి.

జవాబు: వాసంతీ! సముద్రపునీటిలో ఖనిజ లవణాలు, సముద్ర జంతువుల కుళ్లిన అవశేషాలు ఉండటం వల్ల ..సముద్రంలోని రాళ్లు వాతావరణ మార్పుకు గురికావటం వల్ల సముద్ర జల్లాలో ఖనిజాలు, రసాయనాలు చేరుతుంటాయి. అంతేగాక సూర్యుడి తీవ్రవేడిమికి సముద్రంలోని నీరు ఆవిరై సాంద్రీకృత లవణం మిగిలిపోతుంది. దాంతో సముద్రజలం చాలా ఉప్పగా మారుతుంది.

తేడాలు గుర్తిస్తారా జవాబు

1.పాప జడకు రిబ్బన్‌లేదు. 2.సంచిలో క్యాండిల్స్ లేవు. 3.బాలుడి టోపీకి కుచ్చులేదు. 4.బాలుడి చేతిలో కర్రలేదు. 5.చెట్టుపై నక్షత్రం లేదు. 6.పాప చేయి ఖాళీ 7.పాపటోపీకి కుచ్చులేదు. 8.పాప చేతిలో సాక్స్ లేవు. 9.మధ్యపాప టోపీకి కుచ్చు లేదు 10.పాపచేతిలో గిఫ్ట్ లేదు.

నాయకులుగా ఎదగాలంటే..

చరిత్రలో ఏదీ యాదృచ్ఛికంగా జరగదు. ప్రతిదానికీ ఒక ఉద్యమమూ, ఆ ఉద్యమా నికి తగిన నాయకత్వమూ అవసరం. జవహర్‌లాల్ నెహ్రూలాంటి వాళ్ల నాయకులుగా ఉన్నారు కాబట్టే స్వాతంత్ర్యం వచ్చాక తొలి ముప్ఫై ఏళ్లలో మనదేశం పారిశ్రామికంగా, వ్యావసాయికంగా ఎంతో కొంత ప్రగతి సాధించింది. స్వామినాథన్, సి.సుబ్రహ్మణంలాంటి వాళ్ల నేతృత్వం వల్లనే హరిత విప్లవం గొప్ప ఫలితాలను సాధించింది. ప్రేమ్‌జీ, నారాయణమూర్తిలాంటి ముందుచూపు ఉన్న నాయకులున్నారు. కనుకనే ఇవాళ ఇండియా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఆదర్శప్రాయంగా నిలిచింది. ప్రఖ్యాత పోలీస్ ఆఫీసర్ కిరణ్‌బేడీని ఏ శాఖకు పంపినా ఆ శాఖలో తనదైన ప్రత్యేక ముద్రవేసి విశేష ఆదరాభిమానాలు సంపాదించుకోవడానికి కారణం ఆమెలోని నాయకత్వలక్షణాలే. అలాంటి విశిష్ట నాయకత్వం రూపొందడానికి కూడా కొన్ని నాయకత్వ సూత్రాలున్నాయి.

దీర్ఘకాల సూత్రం:

ఒక్కరోజులో రోమ్ నిర్మాణం జరగలేదు. అలాగే నాయకత్వం అన్నది కూడా కేవలం కొన్ని నెలల్లో ఆవిర్భవించేది కాదు. దీర్ఘ కాలంలో మాత్రమే అభివృద్ధిచెందుతుంది.

ఉదాహరణకు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రుల విషయమే ఉదాహరణగా తీసు కుంటే ఎపి సిఎం చంద్రబాబు నాయుడు 1995-2000 సంవత్సరాల మధ్య నిజమైన రాజకీయ నాయకుడిగా అవత రించారు. అయితే ఆయన నాలుగైదేళ్ల లోనే అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించిన నాయకుడిగా ఎదిగారనుకుంటే పొరపాటే. ఆయన 1980 ప్రాంతంలోనే రాజకీయ రంగప్రవేశం చేశాడు. అప్పట్నుంచే తనలోని నాయకత్వ లక్షణాలకు పదును పెట్టుకుంటూనే ఉన్నారు.

అలాగే తెలంగాణ సిఎం కెసిఆర్ కూడా తన దీర్ఘకాలిక అనుభవంతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి నాయకత్వం వహించి, రాష్ట్రాన్ని సాధించారు. తొలుత తెలుగుదేశం పార్టీనుండి రాష్ట్రశాసనసభ్యులుగా, తర్వాత పబ్లిక్ అండర్ టేకింగ్ చైర్మన్ పదవిని నిర్వ హించారు. అలాగే రవాణా మంత్రిగా, శాసనసభ ఉపసభాపతిగా పనిచేశారు. కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. నేడు తెలంగాణ రాష్ట్ర తొలిముఖ్యమంత్రిగా విజయపథంలో సాగుతూ ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారంటే అందుకు ఆయనకున్న దీర్ఘకాల రాజకీయానుభవమే కారణం.

ఇక ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మైక్రోసాఫ్ట్ సిఇవోగా 2014లో ఎంపికైన సత్యనారాయణ నాదెళ్ల (సత్య నాదెళ్ల) కూడా హఠాత్తుగా ఆ స్థాయికి ఎదగలేదు. అంతకుముందు మైక్రోసాఫ్ట్‌లో క్లౌడ్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఐదు సంవత్సరాల్లో కంపెనీ వ్యాపారాన్ని 9వేల కోట్లనుండి 31 వేల కోట్లకు తీసుకువెళ్లారు. ఇది ఇంక్యుబేషన్ పీరియడ్‌లాంటిది. గుడ్డును పొదగడానికి కోడి లేదా యంత్రం తీసుకునే వ్యవధిని ఇంక్యుబేషన్ పీరియడ్ అంటారు. దీర్ఘకాలిక క్రమంలో ఆయన అలవరచుకున్న నాయకత్వ లక్షణాలే ఆయన్ని ఈరోజు ఉత్తమ నాయకుడిగా నిలబెట్టాయి.

అదేవిధంగా నాయకులుగా ఆవిర్భవించ డానికి కూడా ఇంత వ్యవధి అవసరం. ఒక్కరోజులో రోమ్ నిర్మాణం కానట్లే ఏదో కొద్ది నెలల్లోనో లేదా రెండు, మూడేళ్లలోనో ఎవరూ నాయకులుగా ఆవిర్భవించరు. 60లలో అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ గొప్ప నాయకుడిగా రాణించిన మాట నిజం. అయితే ఆయన అంతకుముందు అమెరికన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నప్పుడు తన లోని నాయకత్వ లక్షణాలకు పదును పెట్టుకున్న విషయం మనం గుర్తుంచు కోవాలి.

ప్రభావ సూత్రం:

నాయకుడన్నవాడు తన పరిధిలో పనిచేసే అందరినీ ప్రభావితం చేస్తాడు. 'మార్గదర్శి' సంస్థను నిర్వహించడంలో రామోజీరావు చాలామంది ప్రభావితం చేసి ఉండవచ్చు. ఇలా ప్రభావానికి గురైన వారిలో మనం కృష్ణమూర్తి అనే వ్యక్తిని ఉదాహరణగా స్వీకరించవచ్చు. ఈయన మార్గదర్శి నుండి బయటకు వచ్చి 'మోడల్ ఫైనాన్స్ కంపెనీ'ని దిగ్విజయంగా నడిపారు.

అలాగే పంపాదకులుగా నార్ల వెంకటేశ్వర రావు, కొడవటిగంటి కుటుంబరావు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులులాంటి వాళ్లు చాలా మంది యువ జర్నలిస్టులను గాఢంగా ప్రభావితం చేశారు.

ఇతరులను ప్రభావితం చేయలేని ఏ వ్యక్తీ ఎప్పటికీ నాయకుడు కాలేడు. ఆ మాట కొస్తే నాయకత్వం అంటే పరిమితమైన అర్థంలో ఇతరులను ప్రభావితం చేయడమే. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు వందలాది మంది యువకులను మదర్ థెరిసా అసంఖ్యాకులను ప్రభావితం చేసిన విషయం మనకు తెలిసిందే.

విశ్వాస సూత్రం:

ఇది నాయకత్వానికి పునాదిలాంటిది. నాయకులని వారి అనుచరులు లేదా సహోద్యోగులు వారి నుంచి ఆశించింది పొందగలం అన్న భరోసా ఉన్నప్పుడే నమ్ముతారు. చాలామంది ఎమ్మెల్యేలకు మనమందరం గమనిస్తూనే ఉంటాం. ఒకసారి గెలిచి రెండోసారి ఓడిపోయినప్పుడు నిరాశా నిస్పృహలకు గురయి, దాని పర్యవసానంగా తమ వద్దకు సహాయం కోసం వచ్చే ప్రజలను పట్టించుకోరు. అలాంటి వారిని ప్రజలు అస్సలు నమ్మరు.

కొంతమంది మేనేజింగ్ డైరెక్టర్లు సంస్థ నష్టాలతో నడుస్తున్నప్పుడు ఉద్యోగుల పట్ల ఒక విధమైన అనాసక్తి, వైముఖ్యం పెంచు

కుంటారు. అంటే లాభాలు వస్తున్నప్పుడు ఒక రకంగానూ, నష్టాలు వస్తున్నప్పుడు మరోరకంగానూ వ్యవహరిస్తారు. అంటే వాళ్లల్లో కన్‌సిస్టెన్సీ ఉండవన్నమాట. అటువంటి ఎం.డి.ని ఉద్యోగులు నమ్మడం మానేస్తారు. నిజానికి సంక్షోభ సమయంలోనే అసలు నాయకత్వం బయటకు వస్తుంది.

ప్రేమ సూత్రం:

ప్రజలను నిజంగా ప్రేమించేవాడే ప్రజా నాయకుడవుతాడు. ఉద్యోగులను నిజంగా ప్రేమించేవాడే ఉద్యోగుల నాయకుడవుతాడు. ఓ ఆంగ్ల దినపత్రిక యాజమాన్యాన్ని ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆ పత్రికలో పనిచేసే ఉద్యోగుల తల్లిదండ్రులకు యాజమాన్యం ఏటా ఒక పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు బహుకరిస్తుంది. ఇందులో సందేశం స్పష్టమే. ఉద్యోగిగా నిన్నే కాదు సుమా మీ తల్లిదండ్రుల్ని కలిపి మేము ప్రేమిస్తామన్నదే ఆ సందేశం. ఆ పత్రిక యాజమాన్యం పాటించే మరో అంశం ఏమిటంటే యాజమాన్యం ఉద్యోగులకు బోనస్ మొత్తం చేతికివ్వరట. భద్రంగా ఇంటికి పంపిస్తారట. ఆఫీసులో చేతికిస్తే పొరపాటున పారేసుకోవచ్చు, జేబులు కొట్టేవాళ్లు దాన్ని తస్కరించవచ్చు లేదా ఉద్యోగులు దాన్ని దుర్వినియోగం చేయవచ్చు. అదీ ప్రేమసూత్రం అంటే..

ప్రేమించడంలోనూ, గౌరవించడంలోనూ నాయకుడే ముందుండాలి, ప్రారంభకుడు అవ్వాలి.

ఫలిత సూత్రం:

నాయకుడన్నవాడు ఫలితాలకు ప్రాధాన్యమివ్వాలి తప్ప ఫార్మాలిటీస్‌కు కాదు. మీరొక కంపెనీ యజమాని లేదా మేనేజింగ్ డైరెక్టర్ అనుకోండి. మీ కంపెనీలో ఒక ఇంజనీర్ ఒక వస్తువును తక్కువ ఖర్చుతో తయారుచేసే సరికొత్త పద్ధతిని కనుగొన్నాడనుకొందాం. ఆ మేరకు అతని అన్వేషణ కంపెనీకి సత్ఫలితాన్నిచ్చింది అనుకుందాం.

అప్పుడు మీరు మేనేజింగ్ డెరెక్టర్‌గా కానీ, యజమానిగా కానీ ఆ ఇంజనీర్‌ని అభినందించాలి తప్ప విమర్శించరాదు. అసలు ఈ పరిశోధనను ఎవరి ఉత్తర్వుతో ప్రారంభించావు? ఈ ప్రతిపాదనను పరిశీలనకు ఎందుకు సమర్పించలేదు? అంటూ ప్రశ్నల బాణాలు సంధించే యజమాని లేదా ఎం.డి. నిజమైన నాయకుడు కాలేడు.

అధికార పంపిణీ సూత్రం:

నిజమైన నాయకుడు అధికారాన్ని తన దగ్గరే కేంద్రీకృతం చేసి కూచోడు. ఇతరులకు కూడా అధికారం పంచుతాడు. దీన్నే 'అధికార వికేంద్రీకరణ సూత్రం' అని కూడా అంటారు. నాయకుడు రెండు ముఖ్యమైన విషయాల్ని దృష్టిలో పెట్టుకోవాలి. అవి ఒకటి..సరైన, సమర్థులైన ఉద్యోగిని ఎంపికచేసి తాను చేయదలచుకున్న పనిని అతనితో చేయించాలి. రెండు..అతను ఆ పనిచేస్తున్నప్పుడు పదేపదే జోక్యం చేసుకుని విసిగించకూడదు. అతను కోరినప్పుడే జోక్యం చేసుకోవాలి.

ముఖ్యంమంత్రిగా ఉన్నప్పుడు ఎన్.టి. రామారావు మంత్రులను నమ్మకపోయినా వారితో అధికారాన్ని పంచుకోకపోయినా అధికారుల్ని మాత్రం నమ్మేవారు. ముఖ్యంగా జిల్లా అధికార్లను పూర్తిగా నమ్మి "చట్టం మేరకు ప్రజలకు మేలు చెయ్యండి, మీపైన రాజకీయ వత్తిళ్లు రాకుండా చూస్తాను" అని హామీ ఇచ్చేవారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు రాజధానిలోని ఉన్నత పోలీసు అధికార్లకే సర్వాధికారాలు అప్పగించి "మీరేం చేస్తారో నాకు తెలియదు, శాంతిభద్రతలు నాకు ముఖ్యం" అన్నారు. ఆయన హయాంలో రాష్ట్రంలో ఎక్కడా గొడవలు జరగకపోవడానికి బహుశా ఇదే కారణం కావచ్చు.

సరైన సమయ సూత్రం (లా ఆఫ్ టైమింగ్:

ప్రేమ్‌జీ, నారాయణ మూర్తి, రామలింగ రాజులు సరిగ్గా ఏ సమయంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు స్థాపించాలో ఆ సమయంలోనే స్థాపించారు. కాబట్టే వారు ఘనవిజయాలు సాధించారు.

ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది. 'ఎర్లీ బర్డ్ క్యాచెస్ వర్మ్' అని. నాయకుడన్నవాడు ముందు ఏది చేయాలో నిర్ణయించి ఆ తర్వాత ఏది ఎప్పుడు చేయాలో నిర్ణయించాలి.

* మంచి పని మంచి సమయంలోనే చేయాలి.
* మంచి పని అయినా సరైన సమయంలో చేయకపోతే ఫలితం దక్కదు.
* చేయకూడని పని మంచి సమయంలో చేసినా ఫలితం దక్కదు.

త్యాగసూత్రం:

నాయకుడన్నవాడు త్యాగం చేసి ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలవాలి. 'నువ్వు నాయకుడవైతే నీ గురించి నువ్వు ఆలోచించే హక్కు కోల్పోతావు' అన్నాడొక మేధావి.

ఉదాహరణకు ఏకారణం చేత అయినా మీరు నాయకులుగా ఉన్న సంస్థ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది అనుకుందాం. ఈ సంక్షోభం నుంచి బయట పడటానికి ఆలోచించిన మార్గాల్లో ఒకటి ఉద్యోగులు 'డియర్‌నెస్ అలవెన్స్' ఇవ్వకుండా ఆపివేయడం అనుకోండి. ఈ విషయమై మీరు ఉద్యోగులకు మార్చిలో విజ్ఞప్తి చెయ్యాలనుకోండి.

అందుకు మీరు ఓ నెల ముందుగానే మేనేజ్‌మెంట్ తరఫున మీకందే సౌలభ్యాలను త్యాగం చెయ్యాలి. అప్పుడే ఉద్యోగులకు మీపై గౌరవం పెరిగి మీ ఆజ్ఞలను పాటిస్తారు.

-శృంగవరపు రచన

బామ్మగారి మోడలింగ్!

వయసు 95..అయితేనేం ఎక్కడా తగ్గకుండా ఇంటర్నెట్‌లో లేటెస్ట్ ఫ్యాషన్ మోడలింగ్‌తో సంచలనం సృష్టిస్తోంది. ఈ బామ్మగారి పేరు ఎమీ. ఆస్ట్రియన్ క్యాపిటల్ వియన్నాలోని ఓ కాన్సెప్ట్ స్టోర్‌లో ప్రమోషనల్ షాట్స్‌లో పాల్గొని స్టైలిష్ సర్కిల్స్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఫ్యాషన్ బైబిల్ ఓగ్‌లో కూడా ఈ గ్రానీ దర్శనమిచ్చింది. ఫ్యాషన్ పిక్చర్స్ గ్యాలరీలో సైతం రకరకాల పోజుల్లోని గ్రానీ పిక్చర్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మినీ స్కర్ట్‌లలో, ఎత్తు మడమల పాదరక్షలతో తన మనమరాలితో పోటీపడుతోంది. ఉత్సాహం ఉండాలేకానీ వయసుతో పనేముందని అంటోంది బామ్మగారు.

కథ

అద్దంలో 'కలీమనె'

– బి.లక్ష్మీనారాయణ

కిచకిచలాడుతూ ఉదయం ఫోన్. పేరు చూసిన వెంటనే పెదవులపై మెరసిన హాయైన భావం.

ముంగిట్లో గింజలనేరుకుంటూ పావురాళ్ల కువకువలు నేపథ్య సంగీతంలా...

"ఉభయ కుశలోపరి..." కాళ్లకింద గడ్డిమీద రాలిన మంచు ముత్యాల పలవరింత, వాతావరణం చలిచలిగా వుంది. కార్తీకం ఆఖరు రోజులు కావటంతో పరిసరాల్లో భక్తిపాటలతో దూరంగా వినిపించే గుడిలోని గంటలు పారవశ్యంతో ప్రతిధ్వనించే 'ఓంకార నాదం'.

ముడుచుకున్న మనసుమీద వాలిన తొలి కిరణం పలకరింపులా... పులకరింత.

"ఒకసారి రావచ్చుగా..."

"వచ్చు... కానీ..."

" 'కానీ'ల కాలం కాదు కానీ... పంచుకోవలసిన సంగతులనేకం ఉన్నాయిగా మరి..."

"కాదనను..."

"కానీ... రాదలచుకోలేదు..."

"ఆరోపించకు... అలజడి పెంచకు... ఇప్పుడు వచ్చెయ్యనా..."

"ఏం... రెక్కలు మొలిచాయా ఇంత అకస్మాత్తుగా..."

"అలా అని కాదు కానీ... సర్లే... రెండు మూడు రోజుల్లో బయలుదేరి వస్తాను".

"శుభం భూయాత్... మా అదృష్టం... ఆఁపై ఇంకా మా భాగ్యం"

"అద్సరే... ఆఁ విషయం ఏం చేసావ్, మూడు నాలుగు నెలలయిందనుకుంటా... నువ్వు మాట్లాడి".

"అందుకే... నీవొకసారి వస్తే... ఆ విషయం కూడా మాట్లాడి పరిష్కరించుకుందామనీ.. అయినా... వాళ్లు కూడా... తరచుగా సంప్రదిస్తున్నారు కదా... మనకు కూడా.. మరీ ఆలస్యం చేస్తే బాగుండదు కదా"

"నిజానికి ఆ సమస్య పరిష్కారంలో అక్కడ నా ఉనికి కేవలం నిమిత్త మాత్రమే కదా మిత్రమా!"

"అసలు సమస్యేమిటంటే ఇక్కడ పనివాళ్ల కొరత చాలా తీవ్రంగా వుంది కూడానూ. అయినా యివాళైనా, రేపైనా ఆ పని చేయాల్సిన అవసరమైతే వుంది. సమస్య తీవ్రతవల్ల కూడా కదా"

"అప్పుడే ఆర్నెల్లైంది ఆ గోడ పడిపోయి, పక్కవాళ్లు కొంచెం తీవ్రంగానే స్పందిస్తున్నారు. మొన్న అద్దె యివ్వడానికొచ్చిన రామం కూడా నిష్టూరంగానే మాట్లాడాడు, ఇంట్లో కూడా కొన్ని చిన్న చిన్న పనులున్నాయంటూ.. వాళ్ల తప్పు కూడా లేదులే!"

"ఈరోజు ఆ పని పురమాయిస్తున్నాను ఒక మేస్త్రీకి, అతడు మన కాలనీలోనే ఓ రెండంతస్తుల భవనం పనికి కుదురుకున్నాడు. రెండు మూడు నెలలుగా పనౌతోంది కూడా. ఈ మధ్యనే కొంచెం పనిలో జాప్యం లేదా మందకొడితనం ఏర్పడడంతో అదే సమయంలో నేను కలిసాను, మరో ఆసామి ద్వారా. అప్పుడు మాట్లాడి వుంచాను. అంతా కలిపి రెండు మూడు రోజుల పని దానికే బృహత్ ప్రణాళికలూ... వగైరాలూనూ... అలవాటుగా"

"సరే... సరే... నేను వచ్చేసరికి ఆ పనైపోతుంది కదా... నర్మగర్భంగా'

"అవునయ్యా... తమరొచ్చి సమీక్షిస్తారు కాబోలు అప్పుడు?"

"లేదు... లేదు... అవసరమైతే... నేను సైతం శ్రమిస్తాను తమ సమక్షంలో"

"అయినట్లే... ఆ పనివాళ్లు ఒక్కసారిగా పారిపోతారు తమ విన్యాసానికి, పని విధానానికి భయపడి".

"అపనమ్మకంతో అవమానించడంకంటే అనుమానంతో తక్కువ చేయడం మరింత ప్రమాదకరం. కాదంటావా?"

"మహాప్రభో! క్షమార్హుడను కానా... కానేకానా... కాకపోనా..."

అయితే సరి... సరేసరి"

* * *

"ఇటువంటి కాఫీకోసమే నే వస్తాను మీ వూరికి.. మీ వీధికి... మీ ఇంటికి".

"ఆఁ... ఆఁ... ఇలాంటి కబుర్లకేం కొదవ. క్షణాల్లో మా కణాల నిండా 'చిటికెల పందిరి' వేసి ఆనందం నింపుతావు. సంవత్సరానికోసారి దర్శనమిచ్చి".

"అవునూ... యిప్పుడు మనమొకసారి మన యింటికి వెళ్లి పక్కవాళ్లతో కూడా మాట్లాడి వద్దాం. ఈపాటికి అన్ని పనులూ అయిపోయుంటాయి కూడానూ. ఈ లోపులో మన కారుడ్రైవరు సూర్యుడు కూడా వస్తాడు. నిన్న రాత్రి విజయవాడ వెళ్లాడు కారు తీసుకుని. కొంచెం పనుంది దానికి, అందువల్ల... అందుకోసం.

మనం మధ్యాహ్నం బయల్దేరి శ్రీకాకుళం వెళుతున్నాం కారులోనే. నిజానికి నిన్ను పిలిచింది కూడా అందుకే. ఎంతో కాలంనించి స్టోర్ రూంలో పడివున్న కబుర్లన్నీ పంచేసుకుందామనీ పనిలో పనిగా ఒకసారి ఉత్తరాంధ్రా పర్యటనవల్ల మన మనసులు కూడా స్ఫూర్తిమంతం అవుతాయనీ".

"మన పాత డ్రైవరు నాదం అదే మదన్ వాళ్లమ్మాయికి వంట్లో బావుండలేదని ఒంగోలు వెళ్లాడు. అక్కడ వాళ్లల్లుడు మార్కాపురంలో పని చేస్తాడులే".

నాదం... మదన్ అని ఇంగ్లీషులో రాసి తిరగేస్తే 'నాదం' అవుతాడు. చాలా కాలం నుంచి మన దగ్గర చేస్తున్నాడు. నీకూ తెల్సుగా, ఇప్పటికీ నువ్వంటే అపరిమితమైన గౌరవమూ, ఆపై అభిమానమూనూ. అస్తమానం అడుగుతూంటాడు "ఆс సారు రావడం కుదరకపోతే మనమే వెళ్లివద్దాం సారూ" అంటూ.

"పర్యటన సరే... అక్కడ మనం చేయదగిన... చేయవలసిన తక్షణ కర్తవ్యమేమిటో!"

అప్పటికి మేం బయల్దేరి రెండు గంటలైంది.

నిజానికి పెద్ద పనేంకాదు కానీ.. మా భాగస్వామి అల్లుడు పదవీ విరమణ కార్యక్రమం, అందుకనే"

"సరే...సరే... అంచెలంచెల ప్రయాణమే కదా!"

"ఆс... ఖచ్చితంగా... అనుశృతంగా"

"సూర్యుడేనా? నీ పేరు లేక ముందూ వెనుకా ఇంకా ఏమన్నా వున్నాయా?"

"లేదండీ... సూర్యుడే"

"అయితే మీ యింటి పేరేంటి?"

"తెలుగండీ"

"ఆс..."

"అవును... తెలుగండీ"

"అయితే నువ్వు తెలుగు సూర్యుడన్న మాట.... బాగుంది. మీది ఉత్తరాంధ్ర ప్రాంతమేనా? విజయనగరం ఆ చుట్టుపక్కల మీ ఇంటి పేరుతో చాలా మందున్నట్లున్నారు కదా!"

"అవునండీ... మీకెలా తెలుసండీ!"

"అది కాదులే... ఎప్పుడో చాలా కాలం క్రితం ఆ జిల్లా పనుండి వెళ్లాను. అప్పుడు విన్నాను. 'తెలుగు' అనే యింటిపేరు".

"అవునండీ... మా బాగా చెప్పారండీ... మా వోళ్లు చాలా మందున్నారండీ యింకా అక్కడక్కడ"

"నిజానికి ఇంతవరకూ నేను కనుక్కోలేద సలు.. అతను కూడా చెప్పనేలేదు. అసలు అలా తెలుసుకోవాలని నాకూ, చెప్పాలనీ అతనికీ కూడా అనిపించకపోవడం విశేషం".

"విశేషాలకేంగానీ" అన్నవరం దర్శనానం తరం ఇసుక గడియారం దగ్గర నుంచుని పరికిస్తూ, "అలాని కాదు... అసలు అలా అడగాలనీ, మాట్లాడాలనీ కూడా అనిపించలేదంటే దానికి.... దానికి ఆశ్చర్యం"ఆ తర్వాత ప్రయాణంలో సూర్యుడే ఎక్కువ మాట్లాడాడు. విశాఖ వచ్చేంతవర కూనూ... విశాఖ సముద్ర తీరంలో పరచుకున్న యిసుకలో 'ఆనందపు' అడుగులు జమిలిగా తేలికవుతున్నట్లున్న కబుర్ల ఖజానా, అలా అనిపిస్తుందే కానీ... ఎక్కడనుంచి పుట్టుకొస్తాయో అన్నన్ని కబుర్లు, జ్ఞాపకాలూ, సంగతులూనూ. జీవితంలోని ప్రతీ మలుపూ, అడుగులోనూ పరస్పర వునికి ప్రస్ఫుటంగా.

* * *

"రెండు- రెండున్నర గంటల సమయం పడుతుంది. నువ్వు యిక్కడే గెస్టు హౌస్‌లో విశ్రాంతి తీసుకో. ఎందుకంటే, ఆ కార్యక్ర మంలో నువ్వు 'యిమడ' లేవు, అందుకనీ 'నీ' కార్యక్రమంలో నువ్వుండు. అన్నట్టు ఇక్కడ మాంచి జీడిపప్పు దొరుకుతుంది. అన్నీ అమర్చడానికి మన మనిషున్నాడు ప్రత్యేకంగా. అందాకా అలవాటైన నీ ఏకాం తంలోకి నీకు నువ్వు అమరిపో. కొనసాగిం పుగా మేం వచ్చి చేరతాం అప్పటికి. సూర్యుడు కూడా వుండడు. ఎందుకంటే మేం పట్టుకుపోతున్నాం మాతోపాటుగా. అన్నట్లు యీ రాత్రికి మన మకాం యిక్కడే, మరలా ఉదయం మనం బయలుదేరతాం, అందుకని తీరిగ్గా విశ్రాంతి తీసుకో... మన సుని ఆహ్లాదపరచుకో"

"అవునూ... సింహాచలం కొండమీద నీ జ్ఞాపకాన్ని చెపుతానన్నావ్ కదా. యిప్పుడు 'మనం' యీ ఏకాంతంలో కొనసాగిద్దాం. ఆс తరువాయి భాగాన్ని ఆ రాత్రి వేళల".

"ఇలాగే శీతాకాలం అప్పుడు కూడా. అవును, నాకు గుర్తుంది. విశాఖపట్నంలో చదూతూన్న రోజులవి. మిత్రునితో కలసి సింహాచలం ప్రయాణం. ఆ ఉదయం దర్శనానంతరం మేం ఉభయులమూ పక్కనగల మెట్లపై కూర్చున్నాం. ఇంతలో పెళ్లిబృందం రాత్రి పెళ్లయినట్లుంది, వేరే వూళ్లో పెళ్లి చేసుకుని ఉదయం దైవ దర్శనానికి వచ్చినట్లున్నారు. ఆ బృందం అంతా కలిసి పాతికిరవైమంది.

సూర్యుడు నులివెచ్చగా వున్నాడు. ఆ పెళ్లికొడుకు, పెళ్లికూతురూ కూడా ఇరవైలోపు వాళ్లే. కుదురుగా వున్నారు. తెల్లని ప్యాంట్, పొడుగు చేతుల చొక్కా, మెళ్లో పూలదం డలూ, కర్పూర హారాలూ.

ఆ అమ్మాయి కూడా అంతే. తెల్లని చీర, రవికతో బుట్టబొమ్మలా వుంది. యిద్దరి తలలపై తలంబ్రాలు వాళ్ల కదులుతున్న పుడల్లా కిందకు జారిపడుతున్నాయి.

పసుపు మరకలతో వాళ్ల తెల్లటి బట్టలు మెరుస్తున్నాయి, సూర్యకిరణాలు పడి. దగ్గర సంబంధమనుకుంటా... వధూవరులిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కొంచెం వెనగ్గా నడుస్తున్నారు. ఆ అమ్మాయి చెయ్యి అబ్బాయి చేతిలో సాంప్రదాయబద్ధంగా... ముచ్చటగా వున్నారు. మిగతా బంధుమిత్రులంతా కొంచెం ముందుగా నడుస్తున్నారు.

మేం అలాగే పక్కన కూర్చున్నాం, వాళ్లని గమనిస్తూ, కబుర్లు మానేసి. ఎక్కడా అతిశయోక్తులు, అనవసరంగా సిగ్గుపడడాలూ లేవు.

వాళ్లకు కొంచెం దూరంలో నుంచుని నెమలీకలను అమ్ముతున్న ఆడమనిషి. వాళ్లను దాటి ముందుకు వెళ్లిన ఆ యువ దంపతులు.

ఇంతలో ఆ అబ్బాయికి ఏమనిపించిందో ఏమో, గబగబా వెనక్కి వెళ్లి రెండు నెమలీకలను పొడుగ్గా వున్న వాటిని తీసుకుని వచ్చాడు, అమ్మాయి దగ్గరకు.

ఆమె కళ్లల్లో సిగ్గుతో కూడిన ఆసక్తి, నవ్వుతూ ఏదో అంటోంది అబ్బాయితో.

తన చేతిలో వున్న నెమలీకలతో ఆ అమ్మాయి మొహంమీద సున్నితంగా రాస్తూ, అద్దుతూ, చక్కిలిగిలి అనిపించేలా వాటిని కదుపుతున్నాడు... ఏదో అంటూ. చిన్నగా పాట కూడా పాడుతున్నాడేమో అనిపించేలా చేతులు కదుపుతూ, చక్కని ఆరోగ్యకరమైన, హాయైన నవ్వు యిద్దరి మొహాలలోనూ.

మరింత దగ్గరగా వస్తూ ఆ రెండు నెమలీకల్ని వెనకనుంచి ఆ అమ్మాయి తలలో కిరీటంలా పెట్టాడు. ఆ అమ్మాయి తన రెండు చేతులతో ఆ అబ్బాయి చేతులను పట్టుకుంది. సన్నగా నవ్వుతో వెలుగుతూన్న ఆమె మొహం.

మురిపెంగా చూస్తూ ఆ అబ్బాయి... వాళ్ల అడుగుల్లో వేగం తగ్గుతోంది. కబుర్లతో కాలం వేగంగా దొర్లుతోంది. పరిసరాల్లో ఎండవేడి పెరుగుతోంది. అయినా చలికాలం కావడంతో అంతగా ఎండ అనిపించడం లేదు.

ఇంతలో ఆ అబ్బాయి గబగబా ముందుకు వెళ్లి ఆ అమ్మాయికి అభిముఖంగా తిరిగి చేతులు కట్టుకొని నిలుచుని ఎంతో మురిపెంగా ఆ అమ్మాయిని చూస్తున్నాడు. కొంచెం తల ఎడమ వైపునకు వంచి, ఎంతో బుద్ధిగా.

ఆ అమ్మాయి కళ్లు మెరుపుతో కూడిన వెలుగు ఆ అబ్బాయి కళ్లల్లో ప్రతిఫలిస్తూంది. చాలా చక్కగా వుందనిపించింది. పైగా ఆ అబ్బాయికున్న గొప్ప సృజనాత్మక పరిశీలనాశక్తి అద్భుతమని కూడా అనిపించింది.

"ఆ నవ దంపతుల పేర్లు చెప్పగలవా?"

"ఆс... నాకు గురుతున్నంతవరకూ ఆ అమ్మాయి పేరు మొల్ల. ఆ అబ్బాయి పేరు పాలకచంద్రుడు. అవును... అవే ఖచ్చితంగా." పైగా శ్రీకాకుళం దగ్గరలోని భామిని చుట్టుపక్కల వాళ్లూరు అన్నట్లుగా కూడా గుర్తుంది".

"నిజానికి యిప్పటికి కూడా వాళ్లనీ... వాళ్ల పేర్లనూ దాదాపుగా గురుతు పెట్టుకోవడానికి గల కారణం... వాళ్లిద్దరిలోగల ఆ స్వచ్ఛత, తుళ్లిపడే సెలయేరులాంటి, నిండు వెన్నెల లాంటి, వనదేవతల్లా వాళ్లు వాళ్ల పరిధుల్లో వెల్లివిరిసే ఆనందం కేవలం వాళ్ల సొంతం మాత్రమే. ఆనాటి సంఘటనంతా నాకు యిప్పటికీ నిన్నా... మొన్నా చూసినట్లుగా వుంటుంది. అంతగా నన్నాకట్టుకుంది".

"అయ్యా! తమరు... తమరు... అదేనయ్యా... అదే... నేనేనయ్యా... ఆ సెంద్రున్ని... అయ్యా... నేనేనయ్యా.... మా యింటిదే మొల్లయ్యా... మొల్ల. ఆనందంతో అతని మొహం వెలిగిపోతోంది...."

"నిజమే... చూసే కనులుండాలే కానీ... నిష్కల్మషమైన మనసుండాలే కానీ ప్రతీ వుదయమూ అంతే స్పష్టంగా స్వచ్ఛతతో దోసిలిలో తీసుకున్న సెలయేటి నీళ్లల్లా వుంటుంది కదా"

అందాకా గుమ్మం దగ్గర కూర్చొని వున్న ఆ వ్యక్తిలో కదలిక. మెల్లగా లేచి మా దగ్గరకొచ్చాడు చేతులు రెండూ కట్టుకున్నాడు.

మనిషి కొంచెం వంగినట్లున్నాడు. అది గౌరవంతోనా లేక వయస్సు పెరగడం వలనా?

"అయ్యా! తమరు... తమరు... అదే నయ్యా... అదే... నేనేనయ్యా... ఆ సెంద్రున్ని... అయ్యా... నేనేనయ్యా.... మా యింటిదే మొల్లయ్యా... మొల్ల. ఆనందంతో అతని మొహం వెలిగిపోతోంది. సన్నగా పెరిగిన గెడ్డం... అక్కడక్కడ తెల్లగా మెరుస్తోంది. సన్నగా వణుకుతున్నాడు"

"అద్భుతం... మరలా మిమ్మల్ని చూడ డమా.. అటువంటి భావమే నాలోనూ... యిద్దరిలోనూ... ఒకేలాంటి అనుభూతి... కేవలం భాష మాత్రమే తేడా. ప్రకటనలో వైవిధ్యం కూడా. ఆనందం... ఆశ్చర్యం... అద్భుతం. ముచ్చటగా మూడు భావాలు కలగలసి ఏది ఏ భావమో తెలిసినంతగా.. కలివిడిగా.. జమిలిగా.."

"అయ్యా ఉండండి... యిప్పుడే సిటికెలో మా యింటిదాన్ని పట్టుకొస్తా.."

"నేను చెపుతున్నది వినిపించుకోలేదు. గాల్లో ఎగురుకుంటూ వెళ్లిపోయాడు. తన యింటిదాన్ని అదే మొల్లకి చెప్పి తీసుకుని రావడానికి.

"దగ్గరేలే. వాళ్లిల్లు రెండు నిమిషాల నడక. యీ ఆనందంలో మరింత తొందరగా మళ్లొస్తాడు, వాడి భార్యని తీసుకుని".

"అయ్యా! వచ్చేసామయ్యా... వచ్చేసాం... యిదుగో మా యింటిది... మొల్లయ్యా... మొల్ల".

"ఇదుగోనయ్యా! అప్పుడు మీరు తీసిన పొటోవు యింకా మా దగ్గర అల్లాగే వుందయ్యా.... అంటూ నా చేతికిచ్చాడు. చిన్నగా నలిగినా శుభ్రంగా వుంది. అపురూపంగానే కాపాడుకుంటున్నారు ఆ 'జ్ఞాపకాన్ని' అనిపించింది.

"అయ్యా! యీ పొటోవు పక్కనే ఆనాడు కొన్న రెండు నెమలీకలనూ వుంచాదయ్యా మా వోడంది", అంతే మురిపెంగా మొల్ల.

"కాదండయ్యా... తనే ఆటినల్లా పెట్టిందం దయ్యా... చాలా జాగరతగా చూసుకుం టుందయ్యా"

వాళ్లకు ఆనందంతో మాటలు సరిగ్గా రావడం లేదు. ఎంతో చెప్పాలని వుందన్న ట్లుగా వాళ్ల శరీరాలూ, మనసులూ సన్నగా వణుకుతున్నాయి.

ఆ ఆనందంతో వాళ్ల కళ్లల్లో సన్నటి నీటి పొర. అదీ జ్ఞాపకానికున్న శక్తి. తరతమ భేదం లేని ఆనవాళ్లు అవే అవి... అవి మాత్రమే జీవితానికి గురుతులు... నక్షాలు... అంతే. ఇంతకంటే ఎవరికీ ఏమీ అక్కరలేదు. చాలు చంద్రుడూ... చాలు. యీ ఆనందం చాలు. అమ్మా మొల్లా ధన్యోస్మి. ఆనాటి జ్ఞాపకం యింకా పచ్చిగా వెన్నెలంతా స్వచ్ఛంగా మీ జీవితాలంత పరిణితితో, మొల్లంత కవితాత్మకంగా వుంది కదయ్యా చంద్రుడూ!

"అయ్యా! తమరు సల్లగా వుండాలయ్యా. సింహాచెలం అప్పన్న సల్లగా చూత్తా దయ్యా.... చూత్తాడు. వత్తామయ్యా... దండాలయ్యా. వుదయం మరలా దరిశెనం చేసుకుంటామయ్యా... వత్తామయ్యా"

"నాలుగైదేళ్లయి వుంటుందనుకుంటా యీ చెంద్రుడు మన దగ్గరకు వచ్చి... అప్పట్నించీ మేం తరచుగా వస్తూనే వుంటాం. కానీ... యిలా.. ఎప్పుడూ అదీ కాకుండా వాడి కళ్లల్లో చూసావా...ఆ ఆనందం, వాడి శరీర భాష అంతా ఆనందం... యింకాస్సేపు యిక్కడే వుంటే నాట్యం చేస్తాడేమో అనేంత ఆనందంతో ఉబ్బితబ్బిబ్బులవుతున్నాడు. ఇంతటి ఆనందం నేను ఎప్పుడూ చూడ లేదు, వాడి కళ్లల్లో.. మొహంలో.. శరీరంలో.. నిలువెల్లా ఆనందం తరంగంలా వున్నాడు. సముద్రానికి పోటొచ్చినట్లుగా.

ఇపుడు మరలా వస్తాడు. వాడి భార్యను యింట్లో దిగపెట్టి నువు మొదటిసారి కదూ! యిక్కడకు రావడం. మరోసారి ఒకటి రెండు రోజులుండేలా వద్దాం.

* * *

"సూర్యుడూ... యీ బేగ్ ఆ కార్లో పెట్టరా!" అంటూ చెంద్రుడు హడావుడి పడుతున్నాడు.

నేను యిద్దరికేసీ మౌనంగానూ.. కుతూహ లంగానూ చూస్తున్నాను.

"అవునయ్యా... యీ సూర్యుడు నా మనవడయ్యా. నా కూతురి కొడుకయ్యా, ఒక్కర్తే బిడ్డయ్యా... దాని కొడుకే యీ సూర్యుడయ్యా.." అన్నాడు చంద్రుడు.

మరింతగా ఆశ్చర్యపోవడం ఇపుడు నా వంతైంది.

"మా అల్లుడు సింహాచెలం గుళ్లో పని చేత్తున్నాడయ్యా" చేతులు నలుపుకుంటూ "అవునాం చెంద్రుడూ బాగుంది. బాగుం దయ్యా. ఆరోగ్యం బాగా చూసుకో. మరలా వస్తాన్లే... తొందర్లోనే.

* * *

చూశావా... ఈసారి ఎన్నెన్ని మలుపులో. జీవితంలో అసంభవం అనుకున్న విషయాలు అన్నీ మనముందు అంతా ఎవరో ఏర్పాటు చేసినట్లు అన్నింటినీ ఒకే సూత్రంలో వరు సగా గుది గుచ్చినట్లు... అబ్బా... ప్రకృతి విలాసం... పరమాద్భుతం... ఆనందం... పరమానందంగా వుంది".

"చెంద్రుడూ తెలుసు... సూర్యుడూ తెలుసు. కానీ ఒకరికొకరు తెలుసని నాకు తెలీదు. నిజానికి అలా వాళ్లిద్దరూ ఒకరి కొకరు తెలుసని కూడా నేనూహించలేను. నిజానికి ఎవ్వరికైనా అది అసాధ్యమే అనుకుంటా. యింకా చెప్పాలంటే అసలతను పట్టించుకోలేదు అని చెప్పవచ్చు".

"అంతేనయ్యా... మీరు వచ్చారు కాబట్టి యిన్ని విశేషాలు కలిసాయి".

"మామూలుగా కనిపించే సంగతులూ, జరిగే జరుగుతున్న సంఘటనలూ కూడా ఎక్కడో ఏదో ఒక విశేషంతో మరింత అందంగా అమరుస్తుంటాడు. అది మామూలు కంటికి కనిపించవు, నీలాంటి వాడికి తప్ప".

"నిజానికి మేమంతా కేవలం బుద్ధితో యోచిస్తాం. జరిగిన... జరుగుతున్న సంఘటనలను తద్వారా మా ఆలోచనతో మేం బేరీజు వేసేసుకుంటూంటాం. కాల ప్రవాహంలో మరలా ముడిపడే సందర్భాలు కూడా అప్పటి పరిస్థితులనుబట్టి మాత్రమే స్పందిస్తూంటాం.

కానీ నీలా ప్రతీదీ అద్భుతం... మనసుతో ఆలోచించడమూ తద్వారా ఆలోచితంగానో... అనాలోచితంగానో.. సందర్భంగానో.. అసందర్భంగానో మధనపడిపోవడం అరుదు. అస్సలు అలా జరగదు. అదే... కేవలం అదే... మన మధ్య వున్న వ్యత్యాసం. నా చేయి పట్టుకుని ఆప్యాయంగా నొక్కుతూ.. దూరంగా కనిపిస్తున్నంతమేరా పచ్చగా... ఆకుపచ్చగా... నేలంతా... పచ్చటి తీవాసీ పరచినటుల, ఆకాశం కూడా పచ్చబడింది. సూర్యుడు పశ్చిమాద్రిలోకి పరిమళిస్తున్నాడు. ■

ఈ వారం కవిత్వం

మనిషిని ప్రేమిస్తాను...

నేను మనిషిని ప్రేమిస్తాను
మనీషిని ప్రేమిస్తాను
అక్షరాలను విడదీస్తే ఆక్రోశిస్తాను
లక్షణాలు ఆపాదిస్తే ఆగ్రహిస్తాను
సలక్షణ వ్యక్తిత్వమైతే ఆరాధిస్తాను
మట్టిని కలుషితం చేస్తే
కలవరపడతాను
ఎందుకంటే మట్టి ఎవరినీ వదిలిపెట్టదు
తనే జన్మనిచ్చి తనలోనే
ఇముడ్చుకుంటుంది
కరెన్సీ చుట్టూ తిరుగుతుంటేనేం అర్థం
పరమార్థమని
గుడి చుట్టూ ప్రదక్షిణాలు వ్యర్థమని
విలువల
జ్ఞానేంద్రియాలను చిదిమేసి
దొంగలకు హారతులు పడుతున్నారు
మేధావుల మేధస్సును మట్టుపెడుతూ
ఓటుకుండలను
నోట్లకట్టతో
కొంటున్నారు
పాపం అంటూ
పాపాల బురద
వళ్లంతా పులుముకుంటూ
మరోసారి గంగలో మునిగి
పవిత్రులమైపోదామని యోచిస్తున్నారు
మాంసాహారాన్ని కూడా మడిగా
భోంచేస్తూ
లైంగికానందానికి సాంకేతికను జోడిస్తూ
స్మార్ట్ ఫోనులు, వాట్సాప్లు, స్కైపులు,
ఫేస్బుక్కులకు బుక్కైపోతున్నారు
నీతులన్ని నీళ్లు లేని నూతుల్లో
కప్పెడుతూ
అసుర లక్షణాలతో వింజామరలు
వీచుకుంటున్నారు
అడవిలో చెట్టు అగ్గిపుల్లనెన్నో
సృష్టించగలదు
ఒక్క అగ్గిపుల్ల అడవినంతా
దహించగలదు
వేరుపురుగులన్నీ చేరి విషం
చిమ్ముతుంటే
మంచి ఎంచినా దొరకటం లేదు
మనుషుల్లో అమానుషులకు కొదవే
లేదు
అందుకే మనీషిని ప్రేమిస్తాన్న కల
కలగానే మిగిలిపోతోంది

– వి.వి.కూర్మారావు

రెక్కలు

విశ్వంలో ప్రాణులకు
రెక్కలు జీవరక్షలు
పక్షి జీవితం మొత్తానికి ప్రాణాధారం
సుదూర పయనంలో యిది
ఎంతగా శ్రమిస్తుందో!
భగవంతుడు దీనికిచ్చిన
అమూల్యమైన వరం యిదే.
'రెక్క' రూపాంతరం 'రెక్క'
కాగా 'పక్షమ'ని అర్థం.
మనిషి శరీరంలోని
ఎముకల గూడూ పటిష్టం కావాలి
మనిషికీ రెక్కలు ఆడితేనే
డొక్కలు పనిచేస్తాయి.
ఒంటిలోని ప్రతీ భాగం (పక్షం) పని
చేయడమే
జీవిత బలమనే విషయం చెప్తుంది.
శారీరకంగా ముడివడినా
పరమాత్మ ప్రతి ప్రాణికీ
ఇచ్చిన సందేశమే 'రెక్క'
ప్రతి ప్రాణి భగవత్సేవలో
తన్మయత్వం పొందే ఆలోచన
కల్గిస్తుంది.
వీటి సమగ్రతలో జీవకోటి
పరమాత్మను ఆలోచిస్తూనే
వుంటుంది.
దీనిలోనే వుంది
రెక్కల ఆధ్యాత్మిక సందేశం!

– డా॥ తూములూరి పార్థసారథి

అదో సుఖం!

ఎప్పుడు
ఏదో ఓ జ్ఞాపకానికి
మనం అంటుకోక
తప్పటం లేదు
అదో సుఖం లాంటి
మబ్బు
అందని ఉత్తర ధృవంలో
వైఢూర్యం లాంటి
మెరుపు
రగిలే కలల చుట్టు
ఓ ఏకాంతం దహిస్తుంది
వరించే స్వప్నాల
వెంట ఓ చీకటి
వెంటాడుతుంది
బతుకు నయనం
పంజరంలోనే
అల్లాడుతుంది
మనసు విహంగమైతే
మేఘం వల విసురుతుంది
కాలాన్ని ప్రతి క్షణం
వేటాడే లక్షణం
ఆశల నిరీక్షణలోనే
వేధిస్తుంది
మనసుకెంత కష్టం
మనుగడలోనే
ఈ కాలం లయమైపోతే
మనసుకెంత సుఖం

– రవి ఆర్కే

మార్నింగ్ డ్యూ

వొకానొక సాయంసమయమున
ఎగిసే అలలకు అభిముఖంగా
ఆరడుగుల జ్ఞాపకాల లోకపు
మనిషి వొంటరిగా నిలుచున్నాడు.
దుఃఖభారంతో తీరమున ఇసుక
వామన పాదం కింద అణిగి
నలిగిపోతుంది.
దేహమంతా కన్నీళ్ల నింపుకున్న
కెరటం వొక్కటి
వాడిని చూసి ఆత్రంగా తీరాన్ని చేరి
వాడి పాదాలను కడిగింది.
వాడి కన్నులలోంచి జాలువారిన
కన్నీటి బిందువులు సప్త సముద్రాలకు
తోబుట్టువైంది.
కడలి చేతులు చాపి గుండెలను
హత్తుకుంది
ఓ తెల్లవారుజామున
లేలేత తామరాకుపై మార్నింగ్ డ్యూ.
టెండాన్ నిండా విషాద ఛాయలు
నింపుకున్న జీవితానికి అది
ఓ ఓదార్పు.

– సురేంద్రదేవ్ చెల్లి

సింగిల్ పేజీ కథ

నెక్స్ట్ ఏంటి!?

– గొర్రెపాటి శ్రీను

రాజశేఖర్, శ్రీలతలది అన్యోన్య దాంపత్యం.

అలాంటి వారిద్దరికి రెండు రోజులుగా ఓ విషయం గురించి గొడవ ప్రారంభమయింది.

ఆ గొడవకు కారణం సుకుమారుడి భవిష్యత్!

శ్రీలత రెండు రోజులుగా భర్తపై అలిగి భోజనం కూడా చేయడం లేదు.

శ్రీలత అలగడంతో రాజశేఖర్ మనస్సు కూడా బాగోలేదు.

కృష్ణ మాత్రం ఇవేమి పట్టనట్లుగా తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతున్నాడు.

ఆ రోజు...

ఉదయం నిద్ర లేస్తూనే....

“అయితే నువ్వు చెప్పిన మాటే వినాలంటావు... కృష్ణ చదువు విషయంలో నీ మాటే ఫైనల్ అంటావు. అంతేగా?” అంటూ ప్రశ్నించాడు రాజశేఖర్ శ్రీమతిని ఉద్దేశించి.

అవునన్నట్లుగా తల ఆడించింది. తన నిర్ణయమే ఫైనల్ అన్నట్లుగా ఓ చూపు విసిరింది.

ఇంతకీ అసలు ‘సంగతి’ ఏంటంటే–

కృష్ణ టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ రాశాడు. రిజల్ట్స్ ఇంకా రాలేదు.

ఈ లోపు వాడిని ఏమి చదివించాలా? అనుకుంటూ భార్యాభర్తలు ఇద్దరూ వాదులాడుకోసాగారు.

ఎం.ఎస్సీ మ్యాథ్స్ చదివిన రాజశేఖర్ ఓ ప్రముఖ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

ఎం.ఎస్సీ ఫిజిక్స్ చేసిన శ్రీలత కాలేజ్ టాపర్. పెళ్లయ్యాక కొద్ది కాలం ఉద్యోగం చేసి మానేసింది.

“నాన్న నన్ను ఇంజినీర్ చేయాలనుకున్నారు. నేను ఆ రోజుల్లో ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించినా, ఎంసెట్‌లో టెన్త్ ర్యాంక్ సాధించలేకపోయాను. అయినా అప్పట్లో ఇన్ని ఇంజినీరింగ్ కాలేజ్‌లు లేవు. అందుకే వాడిని ఇంజినీర్ చేయాలని నా కోరిక. మా నాన్న చిరకాల వాంఛ కూడా. ప్లీజ్!” అంటున్న భర్త మాటలకు అడ్డు వస్తూ–

“మా నాన్నగారు నన్ను డాక్టర్ చేయాలనుకున్నారు. నేను చదువులో బెస్ట్ స్టూడెంట్‌ని. అయినా ఎంసెట్‌లో ర్యాంక్ సాధించలేకపోయాను. చదువు విలువ సరిగ్గా గుర్తించక ఎంట్రన్స్‌కి సరిగ్గా ప్రిపేర్ అవ్వలేదు. నిజంగా పట్టుదలగా చదివి వుంటే తప్పకుండా డాక్టర్ అయ్యేదానిని. బట్ సాధ్యం కాలేదు. మనకి ఆర్థికంగా ఎటువంటి లోటు లేదు కదా! అందుకే ఎంత ఖర్చయినా ఫర్వాలేదు, వాడిని డాక్టర్ చదివిద్దాం.

డాక్టర్ అంటే సమాజంలో ఎంతో గౌరవం... కీర్తి. ఆలోచించండి.

“మనవాడు ప్రయోజకుడు అయితే అది అందరికి ఆనందమే కదా!” ఏమంటారు? అన్నట్లుగా చూసింది.

రెండు రోజుల క్రితం–

తల్లిదండ్రులు కృష్ణని పిలిచి మాట్లాడారు.

వాడు చెప్పిన సమాధానం వారిద్దరి మధ్య గొడవకు దారి తీసింది.

ఆఖరికి పంతాలు, పట్టింపులకు కారణం అయింది.

“కన్నయ్యా! టెన్త్ పూర్తయ్యాక నవ్వు ఏం చదవాలనుకుంటు న్నావు?” ప్రశ్నించారు తల్లిదండ్రులు కోరస్‌గా.

“మీ ఇష్టం. మీరు ఏది చదవమంటే అది చదువుతాను” అంటూ తుర్రుమంటూ పరుగు తీశాడు... ఆడుకోవడానికి.

వాడు స్వతహాగా తెలివైన కుర్రాడు.

సానపెట్టని వజ్రం లాంటి వాడని తల్లిదండ్రుల అభిప్రాయం.

* * *

రిజల్ట్స్ వచ్చాయి.

వాడి మార్క్స్ చూసాక రాజశేఖర్, శ్రీలత ఎంతో ఆనందించారు.

స్కూల్ ఫస్ట్ వచ్చాడు కృష్ణ.

“అమ్మా, నాన్నా! నేను అందరిలా ఇంజినీరింగ్, డాక్టర్ కోర్స్ చదవాలనుకోవడం లేదు. నాకు ఎకనమిక్స్ అంటే ఇష్టం. అందుకే దానికి సంబంధించిన చదువు చదవాలనుకుంటున్నాను” అన్నాడు చిరునవ్వుతో.

తల్లితండ్రులు మొదట కొద్దిగా సంశయించినా, పిల్లవాడి అభీష్టం మేరకు చదివించాలన్న నిర్ణయానికి వచ్చారు.

కృష్ణని దగ్గరికి తీసుకుని “అలాగే కన్నా” అంటూ ప్రేమగా ముద్దాడారు. ■

రచనలకు ఆహ్వానం

రచయితలనుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. **రచనలు పంపించాల్సిన చిరునామా:**

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్–80

గృహ ఛాయ వేధ అంటే?

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458

పి.ఎస్ - విజయనగరం

ప్రశ్న: గృహ ఛాయ వేధ అని దేనినంటారు?

జవాబు: ఛాయా వేధలలో అనేక విధాలున్నాయి. నీడ పడటం వలన కలిగే దోషంచేత బాధలు పొందవల్సి వచ్చుటను 'ఛాయా వేధ'గా చెప్పుకోవచ్చు. 'గృహ ఛాయ వేధ' అనగా గృహం నీడ అదే ఇంటి బావిపై పడగా ఏర్పడే దోషం అని అర్థం. అయితే దానికి ఒక 'కాల పరిమితి' కూడా ఉన్నది. ఉదయం, సాయంత్రం, సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో నీడలు పడటం వలన ఏ విధమైన ఛాయ వేధ దోషం కలుగదు.

పగటి రెండు యామములందు (అనగా ఉ॥ 10.48 నుండి 1.12 మధ్యాహ్న కాలం; మ॥ 1.12 నుండి 3.36 వరకు అపరాహ్నం) ఉ॥ 10.48 గం॥ నుండి మ॥ 3.36 గం॥ వరకు గృహ నీడ బావిపైన పడినట్లయితే ఆ ఇల్లు 'గృహ ఛాయ వేధ అనే దోషం కలిగివుంటుంది. ఉ॥ 9 గం॥ నుండి మ॥ 3 గం॥ వరకు అని మత భేదం కూడా ఉంది. ఈ దోషం వలన ఆ ఇంటి యజమాని కళత్ర పీడను, పశు నష్టాన్ని అనుభవించవలసి వస్తుంది. కళత్ర పీడలో అనేక విధాలున్నాయి.

పెళ్లి జరగకపోవటం, పెళ్లి జరిగినప్పటికీ భార్యాభర్తల మధ్యన సఖ్యత కుదరకపోవటం, బలవంతంగా కాపురం చేయటం, ఒకరి వలన మరొకరు మనస్తాపానికి లోనవటం, ఇద్దరి మధ్యన అన్యోన్యత ఉన్న ప్పటికీ ఎడబాటు ఎక్కువగా కలగటం లేదా భార్యా భర్తలలో ఒకరి దీనస్థితికి మరొకరు కుంగిపోవటం; ఒకరి విపరీత ధోరణికి మరొకరు బాధ పడటం మొదలైన అనేక విధాలైన కళత్ర పీడలు గృహ ఛాయ వేధ వలన పొందవలసి రావొచ్చు.

ఈ కారణం చేతనే కాబోలు కాంపౌండ్ గోడకి దగ్గరగాను,

గృహానికి దూరంగాను ఉండేట్టుగా బావి నిర్మాణం గావించాలని వాస్తు నియమం ఉన్నది. అయితే స్థలాభావంచేత గృహానికి దగ్గరగా కూడా బావులు తవ్వుతుంటారు. అటువంటప్పుడు మాత్రమే 'గృహ ఛాయ వేధ' దోషం కలిగే అవకాశం ఉంటుంది. నీరు పడినచోట బావి తవ్వాల్సి వస్తుంది. ఆ స్థానం గృహానికి తప్ప ఈశాన్యం, ఉత్తరం దిక్కుల్లో ఉన్నప్పుడు, ఇంటికి దగ్గరగా బావి తవ్వినప్పుడు 'గృహఛాయ వేధ దోషం కలిగినట్లయితే కళత్ర పీడ, పశునష్టం సాధారణ స్థాయిలో కలుగుతాయి. అలాగాక పశ్చిమ వాయువ్య, దక్షిణం, నైరుతి, ఆగ్నేయం దిక్కుల్లో తవ్విన బావుల వల్ల కలిగే గృహ ఛాయ వేధ దోషం వలన మాత్రం దోష తీవ్రత హెచ్చుగా ఉంటుంది. కళత్ర పీడ, పశు నష్టం అనూహ్యంగా ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు, ఎవరైననూ మిక్కిలి కళత్ర పీడను అనుభవిస్తూ బాధలు పడుతుంటే ఇలాంటి దోషం వుందేమోనని గృహావరణను గమనించి సరిచేసుకోవటం వలన కళత్ర పీడనుండి విముక్తి పొందగలరు. అయితే సాధారణంగా భార్యా భర్తల మధ్యన జరిగే చిన్న చిన్న గొడవలకు, అపార్థాలకు, మనస్తాపాలకు ఇదే వేధ కారణమనుకోకూడదు. వ్యక్తుల మూల స్వభావాలకు వాస్తును తప్పు పట్టకూడదు.

ఏ దిక్కు సింహద్వారం యోగిస్తుంది?

రాధాకృష్ణమూర్తి - కోరుట్ల

ప్రశ్న: 14 సంవత్సరాల క్రితం అన్నదమ్ముల భాగాల పంపకాలలో దక్షిణ సింహ ద్వారం వున్న ఇల్లు నా వాటాకు వచ్చింది. దానికి ఉత్తరంవైపు రోడ్డు వున్నది. పాత వాస్తు ప్రకారం (ఈశాన్యంలో లెట్రిన్) వున్నది. రాధాకృష్ణమూర్తి పేరుగల వ్యక్తికి దక్షిణం దిక్కు బాగుండదని ఒక పుస్తకంలో చదివాను. అప్పటినుండి ఆ ఇంటిని అద్దెకు ఇచ్చి ఉత్తర సింహ ద్వారం వున్న ఇంట్లో అద్దెకుంటున్నాను. 'య' వర్గలకు ఉత్తర సింహద్వారం వున్న ఇల్లు మంచిదని మీరు రాసారు. ఉత్తర సింహద్వారం వున్న ఇల్లు కొనటానికి ప్రయత్నించి కొనలేకపోతున్నాను. ఇచ్చిన అడ్వాన్సులు కూడా పోగొట్టుకున్నాను. నా పేరుకు ఏ దిక్కు సింహద్వారం బాగుంటుందో తెలియచేయగలరు.

జవాబు: మీకు, మీ వ్యవహారనామ రీత్యా ఉత్తర సింహ ద్వారం యోగిస్తుంది. ప్రస్తుత మున్న ఇంటికి దక్షిణ నైరుతి సింహద్వారముంది. ఉత్తర వాయువ్యంలో సాధారణ పెరటి ద్వారమున్నది. ఈశాన్యంలో టాయిలెట్స్ వుండటం, ఈశాన్యం మూత వేయడం కూడా వాస్తురీత్యా తీవ్రమయిన దోషమవుతుంది. ఆ ఈశాన్య మూలనున్న టాయిలెట్స్, బాత్ రూమ్స్ తీసేసి ఆకాశానికి తెరిపి చేయాలి. మీ ఇంటికి ఉత్తర ఈశాన్యం నుండి దక్షిణ ఆగ్నేయానికి నడక వచ్చేలా (ఆ తలుపులను) అమర్చండి. దారిలో గోతులు లేకుండా జాగ్రత్త పడండి.

ఉత్తర ముఖ ద్వార గృహాన్ని కొనాలన్న మీ కోరిక తప్పకుండా తీరుతుంది.

ఏ దిక్కు గృహం పనికొస్తుంది?

శశిభూషణరావు - మచిలీపట్నం

ప్రశ్న: నా పేరుతో ఏ దిక్కు గృహం పనికొస్తుంది?

జవాబు: మీ వ్యవహారనామ రీత్యా మీకు 'ఉత్తర ముఖ ద్వారం' యోగిస్తుంది. ఒకవేళ స్వతంత్ర గృహం తీసుకున్నా, కట్టినా ఉత్తరం వీధి వుండి, ఉత్తర ముఖద్వారం వుండాలి. ఉత్తర ఈశాన్య ముఖ ద్వారం వుండవచ్చు. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొన్నట్లయితే ఆ కాంప్లెక్స్‌కి వీధి ఎటువైపు వున్నప్పటికీ మీరు కొనాలనుకుంటున్న ఫ్లాట్‌కి ఉత్తరం కానీ ఉత్తర ఈశాన్య ముఖ ద్వారం వుంటే మీకు చక్కగా యోగిస్తుంది. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్ వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: --
పుట్టినతేదీ:------------------- ఊరు: ---------------
జన్మనక్షత్రం:----------తల్లిపేరు:---------------------
చిరునామా: --------------------------------------
------------------- ఫోన్: ------------------------

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం
1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com

నన్ను నేను ప్రేమిస్తూనే వున్నాను... అయినా...!?

జె.బి - చెన్నై

ప్రశ్న: ..మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యం- అని మీరు చాలా సార్లు రాసారు. దాన్ని నేను బాగా పాటిస్తున్నాను. నా వయసు 33. అందరూ నన్ను స్వార్థపరుడు అంటున్నారు. ఎవరు ఏమైపోయినా నేను బాగుండాలి అనుకోవడమే కదా! అంటున్నారు. మీరు చెప్పిన సూత్రం నేను పాటిస్తే అందరు తిడుతున్నారెందుకు? అమ్మా, నాన్నలు, భార్య, ఫ్రెండ్స్ అందరి దృష్టిలో అలాగే అయిపోయాను. వాళ్లకేమైనా నష్టం, కష్టం కలిగితే నా బాధ్యత అందులో ఏముంటుంది?

జవాబు: నాన్నా.... నేను చెప్పిన మాటను కొంచెం తేడాగా చెప్తున్నావు. తేడా చిన్నదిగా కనిపించినా ప్రభావం వ్యతిరేకంగా వుంటుంది మరి. మనల్ని మనం ముందుగా ప్రేమించుకోవాలి. కరెక్టే! మనం బాగుంటేనే ఎవరికైనా ఉపయోగపడగలుగుతాం. కనుక ముందు మనం బాగుండాలి. "ఎవరికీ నష్టం కలిగించకుండా మనం బాగుండాలి..." అని చెప్పాను. ఎదుటివారికి మనవల్ల ఎలాంటి నష్టం, బాధ, ఇబ్బంది కలగకుండా మన క్షేమం మనం చూసుకోవడం నా దృష్టిలో స్వార్థం కాదు. మనమే బాగ లేకపోతే ఎవరి బాగోగులు ఏం చూడగలం? నా నిర్వచనం నీకు మరోలా అర్థమైనట్లుంది. సరి చూసుకో!

ఈ మధ్య కొడుతోంది కూడా...

ఎస్.ఎస్ - గుంటూరు

ప్రశ్న: నా వయసు 55. మా ఆవిడకు 50. మాది మేనరికం. మాకు ఒక బాబు. ఆమెకు మొదట్నించీ కోపం చాలా ఎక్కువ. నన్ను, మా బాబుని బాగా క్రమశిక్షణతో పెంచింది. మా అబ్బాయి ఈ మధ్యనే ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు. నేను దొరికిపోయాను. ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నాది. తనకి బాధ, కోపం, చిరాకు, ఒత్తిడి ఏవి కలిగినా నేనే బలవుతాను. తనంటే వున్న ప్రేమతో అన్నీ భరిస్తూ వున్నాను. నాది చిన్ననాటి ప్రేమ. ఊహ తెలిసినప్పటినుంచీ తనే నా జీవితం అనుకున్నాను. ఆ పిచ్చి ప్రేమతోనే ఏమీ అనలేకపోతున్నాను. ఎవ్వరికీ చెప్పుకోలేకపోతున్నా. ఈ మధ్య తన ప్రవర్తన ఘోరంగా తయారయ్యింది. తన కోపం హద్దులు దాటి తిట్టడం నుంచి కొట్టడంవరకూ వెళ్లింది. చీటికీ, మాటికీ గొడవ పడుతోంది. ప్రతీ చిన్న గొడవ తను నన్ను కొట్టడానికే దారి తీస్తోంది. అసలామె ప్రవర్తనకి కారణం ఏమిటి? తను మామూలు స్థితికి వస్తేగానీ తనతో ఉండడానికి నేను సిద్ధంగా లేను. తనకి కౌన్సెలింగ్ ఇచ్చి నాకు సహాయం చేయండి.

జవాబు: మీరిద్దరూ సహకరిస్తే గ్యారంటీగా చెయ్యగలను. సాధారణంగా స్త్రీలలో మెనోపాజ్ దశలో కలిగే హార్మోన్ల మార్పుల వల్ల చిరాకు, అసహనం పెరుగుతాయి. అయితే ఇవి అందర్లో ఒకే రకంగా ఉండవు. వారి వారి మనస్తత్వం, మానసిక స్థితి, కుటుంబ పరిస్థితుల్నిబట్టి ఆ తీవ్రత ఉంటుంది. దానికి భర్తగా మీరు డైరెక్ట్‌గానూ, ఇన్‌డైరెక్ట్‌గానూ కారణం కావచ్చు. ఆమె ఏం చేస్తుంటారనే (వ్యాపకం) విషయం మీరు రాయలేదు. నా అంచనా ప్రకారం ఇలాంటి కండిషన్ (స్థితికి) కారణం తన దైనందిన జీవితాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి.

మీరు నిజంగా కోరుకుంటే ప్రాణయోగ కౌన్సెలింగ్ ద్వారా మీ మధ్య మామూలు పరిస్థితులు వచ్చేలా చెయ్యొచ్చు. ఆలస్యం చెయ్యకుండా యాక్షన్‌లోకి దిగండి.

గుడ్ లక్.

ఎవర్ని పెళ్లి చేసుకోవాలి?

డి.వి.ఆర్ - విజయనగరం

